


Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 140 | మంగళవారం 28 సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



IRS PUBLICATIONS

irspublications12@gmail.com




## బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో


# ఖర్గే, రాహుల్

**పాట్నా-సూర్యవాస్తవం:** బీహార్ మొదటి దశ (నవంబర్ 6) ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ సీనియర్ నేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాధీ, ప్రియాంక గాంధీ వాద్రా, కన్హయ్య కుమార్, స్వంత్ర ఎంపి పప్పు యాదవ్‌తో సహా 40 మంది స్టార్ క్యాంపెయినర్స్ పాల్గొననున్నారు. స్టార్ క్యాంపెయినర్స్ జాబితాలో బీహార్ ఎఐసిసి ఇన్‌ఛార్జి కృష్ణా అల్లవారు, బీహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేష్ రామ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కె.సి వేణుగోపాల్, భూపేష్ బాఘెల్, సచిన్ పైలట్, రణదీప్ సూర్జేవాలా, సయ్యద్ నసీర్ హుస్సేన్, ఆ పార్టీ సీనియర్ నేతలు అశోక్ గెహ్లాట్, తారిక్ అన్వర్, గౌరవ్ గగొరు, మొహమ్మద్ జావెద్, అఖిలేష్ ప్రసాద్ సింగ్‌లు ఉన్నారు. అలాగే హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, సీనియర్ నేతలు దిగ్విజరు సింగ్, అధీర్ రంజన్ చౌదరి, మీరా కుమార్, చరణ్‌సింగ్ చన్నీ, అల్కా లంబా, పవన్ ఖేరా, ఇమ్రాన్ ప్రతాప్‌గరి, షకీల్ అహ్మద్, రణ్‌జింగ్ రంజన్, రాజేష్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్, అనీల్ జైహింద్, రాజేంద్రపాల్ గౌతమ్‌లు ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్లు కాంగ్రెస్ పార్టీ జాబితా విడుదల చేసింది. కాగా, బీహార్ అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో జరగనున్నాయి. ఎన్నికల ఫలితాలు నవంబర్ 14న విడుదల కానున్నాయి. ప్రతిపక్ష కూటమి ఇండియా బ్లాక్‌లో ఆర్‌జెడి, కాంగ్రెస్, వామపక్షపార్టీలు ఉమ్మడిగా పోటీ చేస్తున్నాయి. గురువారం మహాగట్బంధన్ తరపున తేజస్వియాదవ్‌ను సిఎం అభ్యర్థిగా ప్రకటించారు.

## ప్రజాప్రతినిధులు

# క్షేత్రస్థాయిలో ఉండాలి


### తుఫాన్ ప్రభావిత నియోజకవర్గ నేతలకు మంత్రి లోకేష్




**అమరావతి-సూర్యవాస్తవం:** తుఫాను ప్రభావం అధికంగా ఉండే నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు అంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని విద్య, ఐటీ ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు. సచివాలయంలోని ఆర్‌టిజిఎస్ కార్యాలయంలో మొంథా తుఫాన్‌పై సోమవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ - మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


# వణికిస్తోన్న... మొంథా..!



- సీఎంకు ప్రధాని ఫోన్
- శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు రెడ్ అలర్ట్
- ఎనిమిది జిల్లాలకు ఆకస్మిక వరదల ముప్పు
- విజయవాడకు భారీ వర్ష సూచన
- పలు బస్సులు, రైళ్ల రద్దు
- విమాన సర్వీసులు నిలిపివేత
- నేడు తీవ్ర తుఫాన్‌గా మారి రాత్రికి తీరం దాటే అవకాశం




**అమరావతి-సూర్యవాస్తవం:** దూసుకువస్తున్న మొంథా తుపాన్ తీరప్రాంతాన్ని వణికిస్తోంది. రాష్ట్రంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారయంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ రాష్ట్ర ముఖ్యమంత్రికి ఫోన్ చేశారు. పరిస్థితి తీవ్రతపైనా, చేపడుతున్న చర్యలపైనా ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉదయం నుండి రాత్రి వరకు అధికారులతో పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించారు. ప్రాణ నష్టం లేకుండా చూడాలని, సాధ్యమైనంత మేరకు ఆస్థినష్టాన్ని తగ్గించాలని ఆదేశించారు. సోమవారం ఉదయం నుండే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తుపాన్ ప్రభావంతో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు పడుతున్నాయి. అనేకచోట్ల సముద్రపు అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. రాత్రి పది గంటల ప్రాంతానికి తీరప్రాంతమంతా గాలుల ఉధృతి పెరిగింది. పోర్టులలో ఐదవ నెంబర్ ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. తుపాన్ తీరానికి సమీపించే కొద్ది మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందని, మంగళవారం ఉదయానికి తీవ్ర తుపాన్‌గా బలపడుతుందని వాతావరణశాఖ హెచ్చరించింది. దీని ప్రభావంతో గంటకు వంద కిలోమీటర్ల వేగంతో పెను గాలులు వీస్తాయని, అనేకచోట్ల భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు (ఉమ్మడి జిల్లాలు) రెడ్ అలెర్ట్ ప్రకటించింది. దీంతో ఈ జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. రాయలసీమ జిల్లాలకు ఆరంజ్ అలెర్ట్ జారీ అయ్యింది. అదే సమయంలో రానున్న 24 గంటల్లో రాష్ట్రంలోని ఎనిమిది ఉమ్మడిజిల్లాల్లో ఆకస్మిక వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) విరుచుకు పడే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ నుండి హెచ్చరికలు అందాయి. విశాఖపట్నం, విజయనగరం, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాలు ఈ జాబితాలో ఉన్నాయి. మంగళవారం నాడు - మిగతా 2లో..



## రక్షణ చర్యల బాధ్యత

# కలెక్టర్లదే

- ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం
- రూ.3 వేలు నగదు, నిత్యావసరాల పంపిణీ

**అమరావతి-సూర్యవాస్తవం:** తుపాను సమయంలో రక్షణ చర్యల బాధ్యత కలెక్టర్లదేనని, ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సోమవారం తుపానుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పునరావాస కేంద్రాల్లో ఉండే ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, రూ.3000 నగదు, నిత్యావసర సరుకులు అందించేలా చూడాలని ఆదేశించారు. అలాగే వైద్య సేవల కోసం సిబ్బంది అందుబాటులో ఉండాలని, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, నాణ్యమైన ఆహారాన్ని ఇవ్వాలని సూచించారు. ప్రతి కేంద్రానికి ఒక ఇన్‌ఛార్జిని నియమించాలని తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ఎక్కడా కలుషితం కాకుండా చూసుకోవాలని ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని, ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా అధికారులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. వాలంటరీగా వచ్చేవారిని తుపాను సహాయక చర్యలకు ఉపయోగించుకోవాలని, ప్రభుత్వ యంత్రాంగమంతా నిబద్ధతతో పనిచేసి మొంథా తుపానును సమర్ధవంతంగా - మిగతా 2లో..

# ఉపాధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- ఏపీడీలు ఉదయం 6 గంటలకే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలి
- పనుల్లో పురోగతి తీసుకురావాలి
- పీజీఆర్ఎస్ అర్జీలను గడువు తీరకుండానే పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ ఆనంద్

**అనంతపురం, సూర్యవాస్తవం**

ఉపాధి హామీ పనులు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఇందులో అలసత్వం ఉండరాదని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మొంథా తుఫాన్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, ఉపాధి హామీ పథకం, ఈ-పంట నమోదు, ఏపీఎంఐపి, హౌసింగ్, తదితర అంశాలపై ఆయా శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, ఎస్డీసీలు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల క్షేత్రస్థాయి అధికారులతో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద లేబర్ టర్నవుట్ కి సంబంధించి గత వారంలో 3 లక్షల 72 వేల లక్ష్యం ఉండగా, కేవలం 77,319 మంది కూలీలను మొబిలైజేషన్ చేశారని, ఇది ఎంత మాత్రం తగదన్నారు. జిల్లాలోని విడపనకల్లు, నార్పల, డి.హీరేహాల్, వజ్రకరూరు, పెద్దపప్పూరు, తదితర 15 మండలాల్లో 20 శాతం కన్నా తక్కువగా లక్ష్యాన్ని చేరుకున్నారన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి 25వతేదీ వరకు విడపనకల్లు మండలంలో 12,600 లక్ష్యానికి గాను 1,101 చేరుకుని 8.74 శాతం మాత్రమే లక్ష్యాన్ని చేరుకున్నారని, నార్పల మండలంలో 18 వేలకు 1,846 చేసి 10.26 శాతం లక్ష్యం - మిగతా 2లో..



Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in





## ఉపాధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి చేశారని, డి.హీరేహాల్ మండలంలో 9600 లక్ష్యానికి గాను 1,015 చేసి 10.57 శాతం మాత్రమే లక్ష్యం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఆయా మండలాల్లో వెంటనే ఉపాధి పనుల లేబర్ టర్నవుట్ లో పురోగతి తీసుకురావాలని, సంబంధిత ఏపీడీలు మండలాల్లో తనిఖీలు చేయాలని, రోజు ఉదయం 6 గంటలకు క్షేత్రస్థాయికి వెళ్లి పనులను మానిటర్ చేయాలని, ఉపాధి పనుల్లో పురోగతి తీసుకురావాలని ఆదేశించారు. పనుల్లో పురోగతి తీసుకురాకపోతే చర్యలు తీసుకునేందుకు వెనకాడమన్నారు. విడపనకల్లు, బ్రహ్మసముద్రం మండలాల ఎంపీడీవోలు 15 వర్క్ సైట్ తనిఖీలలో ఒకటి చేయలేదని, వెంటనే పూర్తి చేయాలన్నారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ కి సంబంధించి 100 శాతం లక్ష్యం చేరుకోవాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్, ఇన్స్టిట్యూషనల్ ప్లాంటేషన్, పల్లెవనాలకు సంబంధించిన ప్రతిపాదనలు పంపి మంజూరులు తీసుకుని గ్రౌండింగ్ చేయాలని, ఇప్పటికే మంజూరులు తీసుకున్న వాటిని పూర్తి చేయాలన్నారు. ఫారంఫండ్ పనులు, వ్యక్తిగత సోక్ పిట్లు, కమ్యూనిటీ సోక్ పిట్లను లక్ష్యానికి అనుగుణంగా గ్రౌండ్ చేసి పూర్తి చేయాలని, 90 రోజుల హౌసింగ్ కి సంబంధించి పురోగతి తీసుకురావాలని, వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ చేపట్టడంలో వేగం పెంచాలన్నారు. హౌసింగ్ కి సంబంధించి ఆవాస్ ప్లస్ 2024 సర్వే రిపోర్ట్ లో సర్వేయర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈకేవైసీ పూర్తి చేయాలని, వచ్చే నెల 5వ తేదీలోపు లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) అర్జీలను గడువు తీరకుండానే తప్పకుండా పరిష్కరించాలని, బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లడానికి వీలులేదని, ఇప్పటికే పెండింగ్ ఉన్న 39 బియాండ్ ఎస్ఎల్ఏలను వెంటనే పరిష్కరించాలన్నారు. అర్జీలను సరైన సమయంలో గడువులోపు నాణ్యతగా పూర్తి చేయడం ఎంతో ముఖ్యమైనదని, వచ్చే సోమవారం నాటికి బియాండ్ ఎస్ఎల్ఏ అర్జీలు పెండింగ్ ఉంటే సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫీడ్బ్యాక్ సర్వేలో సంతృప్త స్థాయి మరింత పెరగాలని, బొమ్మనహల్, సెట్టూరు తదితర మండలాల్లో ఆర్డీవోలు పర్యటించాలని, ఫీడ్బ్యాక్ సర్వేలో మరింత పురోగతికి కార్యచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ పంట సర్వేకి సంబంధించి 100 శాతం నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు.మొంథా తుఫాను కారణంగా భారీ వర్షాల ప్రభావం వలన దెబ్బతిన్న జిల్లాలకు అవసరం మేరకు ఉన్నత స్థాయి ఆదేశాల మేరకు జిల్లాలోని డిపిఓ, పిఆర్, డిఎంహెచ్ఓ, ఆర్.అండ్.బి, వ్యవసాయ, పలు శాఖల పరిధిలో అధికారులు, సిబ్బంది సహాయక చర్యలకు హాజరయ్యేందుకు మెన్ మరియు మెటీరియల్ సిద్ధం చేసుకుని సన్నద్ధంగా ఉండాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పనాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, సిపిఓ అశోక్ కుమార్, హౌసింగ్ పిడి శైలజ, డ్వామా పిడి సలీమ్ భాష, డిపిఓ నాగరాజునాయుడు, జడ్పి సిఈఓ శివ శంకర్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రక్షణ చర్యల బాధ్యత కలెక్టర్లదే

(మొదటిపేజీ తరువాయి)

అలసత్వమూ కనిపించకూడదని తెలిపారు. దీనిపై నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ ఆదివారం రాత్రి నుండి వర్షాలు పడుతున్నాయని, అన్ని చర్యలూ తీసుకున్నామని పేర్కొన్నారు. ఎక్కడా కాలువగట్లు, చెరువులకు గండిపడకుండా చూడాలని తెలిపారు. భారీవర్షాలతో నీరు ఎక్కడా నిలిచిపోకుండా డ్రెయినేజీ వ్యవస్థను పర్యవేక్షించాలని, తుపాను సమయంలో ప్రజలు బయటకు రాకుండా చూసుకోవాలని కోరారు. విజయవాడ, మంగళగిరి వంటి కొండ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడకుండా జాగ్రత్తచర్యలు చేపట్టాలన్నారు. మొంథా తుపాను కార్యాచరణ భవిష్యత్‌లో వచ్చే తుపాన్లను ఎదుర్కొనేందుకు ఒక మోడల్‌గా ఉండాలని సిఎం అన్నారు. తుపాను ప్రభావిత జిల్లాల్లో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సెలవుల్లో ఉన్న అధికారులు వెంటనే విధుల్లో చేరాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. తుపానుపై ఇరిగేషన్ అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చెరువులు, కాల్వగట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేయాలని కోరారు. బుడమేరు డైవర్షన్ ఛానల్‌పై నిరంతరం నిఘా ఉండాలని ఆదేశించారు. అవసరమైన ఇసుక బస్తాలు, మోటార్లు, బోట్లను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. గేట్లు, స్లూయిస్‌లు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని చెప్పారు. రిజర్వాయర్ల నుండి దిగువకు నీరు వదిలితే దిగువ ప్రాంత ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని ఆదేశించారు. విజయవాడ నగరంలో బుడమేరులో ఎటువంటి అడ్డంకులూ లేకుండా చూడాలని కోరారు.

### బీహార్ లో ప్రచారానికి

## చంద్రబాబు, పవన్

**విజయవాడ, సూర్యవాస్తవం :** దేశంలో విచిత్ర రాజకీయ పరిస్థితి నడుస్తోంది. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చి ప్రధాని అయ్యారు నరేంద్ర మోడీ. అయితే అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి రాజకీయంగా పోరాటం చేస్తోంది. చిన్న అవకాశం కోసం ఎదురుచూస్తోంది. ముఖ్యంగా బిహార్ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలిస్తే బిజెపికి ఇబ్బందికర పరిస్థితులు తప్పవు. అందుకే అక్కడ చెమటోడ్చుతుంది ఎన్డీఏ. అక్కడ గెలుపు ఏమంత సులువు కాదు కూడా. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి గట్టి సవాల్ విసురుతోంది. ఒక విధంగా చెప్పాలంటే బీహార్ ఎన్నికల వరకు ఒక ఎత్తు. దాని ఫలితాలు మరో ఎత్తు అన్నట్టు ఉంటుంది పరిస్థితి. ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్య పక్షాలు తక్కువ. అదే ఇండియా కూటమిలో అయితే జాతీయస్థాయిలో చాలామంది నేతలు ఉన్నారు. ఇండియా కూటమి తరుపున ప్రచారం చేసేందుకు చాలామంది నేతలు క్యూ కడుతున్నారు. ఈ తరుణంలో ప్రధాని నరేంద్ర మోడీ, బీహార్ సీఎం నితీష్ కుమార్ గట్టి వ్యూహాలు రూపొందిస్తున్నారు.జాతీయస్థాయిలో చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక ఇమేజ్ ఉంది. కొన్ని దశాబ్దాలుగా కేంద్ర రాజకీయాల్లో సుపరిచితుడు చంద్రబాబు. ఆపై మంచి పాలనా దక్షుడు అన్న పేరు తెచ్చుకున్నారు. జాతీయస్థాయిలో మంచి ఇమేజ్ ఉంది. అందుకే బీహార్ ఎన్నికల్లో ప్రచారం చేయాలని చంద్రబాబును బిజెపి పెద్దలతో పాటు నితీష్ కుమార్ ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు తెలుస్తోంది. గతంలో ఢిల్లీలో ప్రచారం చేశారు చంద్రబాబు. అక్కడ తెలుగువారితో పాటు జాతీయస్థాయిలో చంద్రబాబు ప్రభావం చూపడంతో ఎన్డీఏ గెలుపులో భాగస్వామ్యం అయ్యారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వెళ్లిన చంద్రబాబు సోదరుడు రామ్మూర్తి నాయుడు ఆకస్మిక మరణంతో తిరిగి వచ్చేసారు. ఇప్పుడు బీహార్ ప్రచారానికి వెళ్తున్నట్లు స్వయంగా చంద్రబాబు ప్రకటించారు.పవన్ కళ్యాణ్ సైతం బీహార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం ఉంది. గతంలో అన్ని రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో పవన్ పాల్గొన్నారు. సనాతన ధర్మం, హిందూ పరిరక్షణ విషయంలో పవన్ చర్యలను జాతీయస్థాయిలో హిందూ వాదులు గట్టిగానే సమర్థించారు. బీహార్లో సైతం పవన్ ప్రచారం చేస్తే హిందువులు గుంప గుత్తిగా ఎన్డీఏకు ఓటు వేస్తారని బిజెపి పెద్దల ఆలోచన. అయితే బిజెపి విషయంలో పవన్ ఎప్పుడు సానుకూలంగానే ఉంటారు. తప్పకుండా బిజెపి వినతిని పరిగణలోకి తీసుకొని బీహార్ ప్రచారంలోకి వెళ్తారు పవన్ కళ్యాణ్. అయితే ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం బిజీగా ఉంది. వచ్చే నెల 14, 15 తేదీల్లో విశాఖలో పెట్టుబడుల సదస్సు జరగనుంది. దానికి ఆహ్వానించేందుకు సీఎం చంద్రబాబు తో పాటు మంత్రులు తరచూ విదేశాలకు వెళ్తున్నారు. వచ్చే నెల విశాఖ సదస్సు జరగనున్న దృష్ట్యా బిజీ గా ఉన్న తరుణంలో.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వేర్వేరుగా బీహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లే అవకాశం ఉంది. దీనిపై అధికారిక షెడ్యూల్ రావాల్సి ఉంది.

## అమరావతికి చట్టభద్రత...



**గుంటూరు, సూర్యవాస్తవం :** ఏ రాజకీయ పార్టీకైనా ప్రజాభిప్రాయమే ఫైనల్. ప్రజల అభిష్టానికి వ్యతిరేకంగా వెళితే ప్రతికూల ఫలితాలు తప్పవు. అయితే ఈ విషయంలో వెనక్కి తగ్గిన వారే ప్రజల మధ్య నిలబడగలరు. కానీ ఈ విషయంలో ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి మొండిగా ముందుకు వెళ్తున్నారు. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత కూడా అమరావతి రాజధాని నిర్మాణం పై ఆయన అభిప్రాయం మారలేదు. ఇటీవల ప్రెస్ మీట్ లో అమరావతిపై విముఖత చూపేలా మాట్లాడారు. ఇక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు ఆ పార్టీ అనుకూల మీడియా, సోషల్ మీడియా గురించి చెప్పనవసరం లేదు. పేర్ని నాని లాంటి వ్యక్తి అయితే అమరావతిని ఉద్దేశించి చాలా తేలిగ్గా మాట్లాడారు. అమరావతి మునిగిపోతుందని ఒకరు.. అక్కడ పెట్టుబడి పెట్టడం వేస్ట్ అన్నట్టు మాట్లాడారు. చివరకు వైసిపి గెలిచిన జగన్ అమరావతి నుంచి పాలన సాగిస్తారన్న సకల శాఖ మంత్రి సజ్జలకు సైతం జగన్ క్లాస్ పీకినట్లు వార్తలు వచ్చాయి. అమరావతి రాజధానిపై నాడు జగన్ సర్కార్ వ్యవహరించిన తీరు కూడా మొన్నటి ఓటమికి ఒక కారణం. కానీ దాని నుంచి గుణపాఠాలు నేర్చుకోలేదు జగన్మోహన్ రెడ్డి.2014, 2019 ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ఆ రెండుసార్లుతో పోల్చుకుంటే 2024 ఎన్నికల్లో బిజెపికి వచ్చిన స్థానాలు చాలా తక్కువ. దానికి కారణం లేకపోలేదు. వ్యవసాయానికి సంబంధించి మూడు సాగు చట్టాలను తీసుకొచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. దేశవ్యాప్తంగా దీనిపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయింది. ప్రజల అసంతృప్తిని గమనించారు నరేంద్ర మోడీ. తాను ప్రవేశపెట్టిన సాగు చట్టాలపై ప్రజలకు అర్థమయ్యేలా చెప్పలేకపోయామని.. అందుకే వాటిని రద్దు చేస్తున్నట్లు చెప్పి వెనక్కి తగ్గారు ప్రధాని మోదీ. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఎప్పుడైతే సాగు చట్టాలను వెనక్కి తీసుకున్నారు కొంత సానుకూలత గా మార్చుకోండి బిజెపి. ఆ సాగు చట్టాలను వెనక్కి తీసుకోకుంటే మాత్రం బిజెపికి భారీ మూల్యం తప్పదుఅయితే మొన్నటి ఎన్నికల్లో జగన్ మూడు రాజధానుల నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకించారు. అయినా సరే వైసీపీ అమరావతిపై విషం చిమ్మడం మానలేదు. అయితే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం సైతం స్పష్టమైన సంకేతాలు పంపగలిగింది. ఇకమీదట అమరావతి రాజధానిని కదిలించలేరని తన చర్యల ద్వారా చెప్పింది. ఏకంగా కేంద్ర ప్రభుత్వంలో కీలకమైన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన ప్రధాన కార్యాలయాన్ని అమరావతిలో నిర్మించాలని భావిస్తోంది. నాలుగు ఎకరాల భూమిని అమరావతిలో కొనుగోలు చేసింది. 12 కోట్ల రూపాయలు వెచ్చించి ఏపీ ప్రభుత్వం నుంచి ఆ భూమిని కొనుగోలు చేసింది రిజర్వ్ బ్యాంక్. అన్ని ఆలోచించి రిజర్వ్ బ్యాంక్ ఈ నిర్ణయానికి వచ్చింది. కచ్చితంగా అమరావతిని కేంద్రం చట్టబద్ధత చేస్తుందని తెలిసి ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. రిజర్వ్ బ్యాంక్ పరిధిలో పనిచేసే 12 ప్రాంతీయ బ్యాంకుల సైతం తమ ప్రధాన కార్యాలయాలను నిర్మించనున్నాయి. ఈ నెల 28న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఈ కార్యాలయ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. కేంద్రం నుంచి అనుమతి తీసుకున్న తర్వాత మాత్రమే ఈ ఆర్థిక రంగ బ్యాంకింగ్ సంస్థల ఏర్పాటు జరుగుతుంది. అంటే త్వరలో పార్లమెంటులో అమరావతి రాజధానికి చట్టబద్ధత లభించనుందన్నమాట.

## వణికిస్తున్న మొంథా

(మొదటిపేజీ తరువాయి)

విజయవాడలో భారీ వర్షాలు కురుస్తాయంటూ తాజాగా హెచ్చరికలు జారీ అయ్యాయి. విజయవాడ నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో 16 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఈ హెచ్చరికల్లో వాతావరణ శాఖ పేర్కొంది. దుకాణాలు, వాణిజ్య సంస్థలను మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. తుపాన్ తీవ్రత నేపథ్యంలో రాష్ట్రంలో 100కు పైగా రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసింది. ఆర్‌టిసి కూడా పలు బస్సు సర్వీసులను నిలిపివేసింది. రాష్ట్రంలోని అన్ని ఎయిర్‌పోర్టుల్లో కార్యక్రమాలను నిలిపివేశారు. మొంథా తుపాను 233 మండలాల్లోని 1,419 గ్రామాలు, 44 మున్సిపాలిటీల్లో ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. మంగళవారం రాత్రికి కాకినాడ, యానాం మధ్య తీరం దాటుతుందని భావిస్తున్నారు.

### ప్రజాప్రతినిధులు

## క్షేత్రస్థాయిలో ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని చెప్పారు. ప్రస్తుత సమాచారం ప్రకారం కాకినాడ సమీపంలో తుపాన్ తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలోని ప్రజాప్రతనిధులు, అధికారులు సంయుక్తంగా పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు అవసరమైన సాయం అందించాలని చెప్పారు.అవసరమయితే కూటమి పార్టీలకు చెందిన కేడర్ ఆయా ప్రాంతాల్లో సహాయ చర్యల్లో పాల్గనాలని సూచించారు. లంక గ్రామాల్లోని ప్రజల కోసం ముందస్తుగా సహాయ శిబిరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. శిబిరాల్లో నిరాశ్రయులకు అవసరమైన ఆహారం, నీరు సిద్ధంగా ఉంచాలని వెల్లడించారు. భారీవర్షాల కారణంగా ఎటువంటి అంటురోగాలు ప్రజబలకుండా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది చర్యలు చేపట్టాలని చెప్పారు. అత్యవసర వైద్యసేవల కోసం అంబులెన్స్‌లు, మందులు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఆ శాఖ సిబ్బంది సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. కమ్యూనికేషన్ సమస్యలు తలెత్తకుండా సెల్‌ఫోన్ ఆపరేటర్లు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భారీవర్షాల కారణంగా చెరువు కట్టలు తెగే ప్రమాదం ఉన్నందున ఇసుక బస్తాలు, యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పంటపొలాల్లో నీరు నిలిచిపోయే అవకాశం ఉన్నందున ఆయిల్ మోటార్లు సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. తుపాను పరిస్థితులను గమనిస్తూ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుపాన్ బాధితులకు ఎటువంటి సాయం అవసరమైన వెంటనే స్పందించేందుకు యంత్రాంగం నిరంతరం సిద్ధంగా ఉంటుందని వెల్లడించారు.

## విదేశీ సంస్థల చేతికి ప్రభుత్వ బ్యాంక్‌లు..!

**- పిఎస్‌బిల్లో 49 శాతం ఎఫ్‌డిఐలు**
**- మోడీ సర్కార్ కొత్త ప్రతిపాదనలు**
**- ఆర్‌బిఐ సంప్రదింపులు**

**న్యూఢిల్లీ-సూర్యవాస్తవం:** : దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న ప్రభుత్వ రంగ బ్యాంక్‌లను క్రమంగా ప్రయివేటు, విదేశీపరం చేసేలా మోడీ సర్కార్ కుట్రలు చేస్తోంది. ఇందుకోసం ప్రభుత్వ బ్యాంకులలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 49 శాతానికి పెంచేలా కొత్త ప్రతిపాదనలు చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంక్ (పిఎస్‌బి)ల్లో ప్రస్తుతం ఎఫ్‌డిఐల పరిమితి 20 శాతంగా ఉంది. దీన్ని రెట్టింపు పైగా చేయడానికి వీలుగా భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ)తో ఆర్థిక మంత్రిత్వ శాఖ చర్చలు జరుపుతోంది. ప్రయివేటు బ్యాంక్‌ల కంటే పిఎస్‌బిలు బలహీనంగా ఉన్నాయని.. వాటికి మరింత మూలధనం అవసరమని మోడీ సర్కార్ తప్పుడు ప్రచారాన్ని చేస్తూ ఈ రంగంలో ఎఫ్‌డిఐలకు రెడ్‌కార్పెట్ వేస్తోంది. దేశంలో 12 ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు ఉన్నాయి. వీటి మొత్తం ఆస్తులు 1.95 లక్షల కోట్ల డాలర్లుగా (దాదాపు రూ.170 లక్షల కోట్లు) ఉంది. ఇవి బ్యాంకింగ్ రంగంలో 55 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ప్రభుత్వం ఈ బ్యాంకుల్లో కనీసం 49 శాతం వాటాకు తగ్గించుకోవాలనేది లక్ష్యం. ప్రస్తుతం కెనరా బ్యాంక్‌లో విదేశీ యాజమాన్యం వాటా 12 శాతం ఉండగా, యూకో బ్యాంక్‌లో దాదాపు సున్నాకి దగ్గరగా ఉంది.

ఎన్ని ఆర్థిక సంక్షోభాలు వచ్చినా భారత బ్యాంక్‌లు పటిష్టంగా పని చేయడంతో విదేశీ సంస్థలు ఇక్కడి విత్త సంస్థల్లో పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నాయి. ఇటీవల ఆర్‌బిఎల్ బ్యాంక్‌లో 60 శాతం వాటాను 3 బిలియన్ డాలర్ల (రూ.26వేల కోట్లు)కు దుబారుకు చెందిన ఎమిరేట్స్ ఎన్‌బిడి కొనుగోలు చేసింది. యెస్ బ్యాంక్‌లో 20 శాతం వాటాను 1.6 బిలియన్ డాలర్ల (రూ.14వేల కోట్లు)కు జపాన్‌కు చెందిన సుమిటోమో మిత్సురు బ్యాంక్ స్వాధీనం చేసుకుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ బ్యాంకులలో వాటాలను విదేశీ సంస్థలకు విక్రయించడం ద్వారా ఖజానా నింపుకోవాలని కేంద్రం యోచిస్తోంది.

సాధారణంగా ప్రయివేటు బ్యాంక్‌లు ప్రజలకు చౌక బ్యాంకింగ్ సేవలను అందించడం లేదు. పేద, మధ్య తరగతి ప్రజలకు జన్‌ధన్ లాంటి ఖాతాలను ఇవ్వడానికి కూడా నిరాకరిస్తున్నాయి. సామాజిక బాధ్యతలకంటే లాభాలే పరమవదిగా పని చేస్తున్నాయి. పలు బ్యాంక్‌లు సేవింగ్ ఖాతాల్లోనూ రూ.10వేల డిపాజిట్ ఉండాలని షరతులు విధిస్తోన్నాయి. ఇలాంటి పరిణామాల మధ్య ఇంకా విదేశీ సంస్థలకు భారత బ్యాంక్‌ల్లో పెట్టుబడులకు అనుమతిస్తే.. సాధారణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను దూరం చేయడమే అవుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తోన్నారు. ప్రస్తుతం ప్రయివేటు బ్యాంక్‌ల్లో విదేశీ పెట్టుబడుల పరిమితి 74 శాతంగా ఉంది. లాటిన్ అమెరికా, ఆసియా దేశాల్లో బ్యాంకింగ్ రంగంలో ఎక్కువ ఎఫ్‌డిఐలను అనుమతించడం ద్వారా అక్కడి స్థానిక ఆర్థిక విధానాలపై ప్రభుత్వాలు నియంత్రణ కోల్పోయాయి. దీంతో ఆర్థిక సంక్షోభాలు ఏర్పాడిన ఘటనలు ఉన్నాయి. భారత్‌లోని ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు వ్యవసాయ, ఇతర ప్రాధాన్యత రంగాల రుణాల జారీలో కీలకంగా ఉన్నాయి.

# సంపాదకీయం

## వాయుగండాలు

ప్రపంచంలోనే అతి పెద్ద తీరప్రాంతం బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉంది. సుమారు 50 కోట్ల మంది ఈ తీర ప్రాంతంలో నివసిస్తున్నారు.అలాగే ప్రపంచ చరిత్రలో అత్యంత ఘోరమైన తుపానుల్ని ఎదుర్కొంటోంది కూడా ఈ తూర్పు తీర ప్రాంతమే.వాతావరణ వివరాలను అందించే వెబ్ సైట్ వెదర్ అండర్ గ్రౌండ్‌లో ఈ తీరానికి సంబంధించి కొన్ని ఆసక్తికర వివరాలున్నాయి. ప్రపంచ చరిత్రలో అత్యంత ఘోరమైన 35తుపానుల్లో 27 పెనుతుపాన్లు ఈ తీరంలోనే సంభవించాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.ఘోరమైన తుపానులన్నీ బంగాళాఖాతంలోనే సంభవిస్తుంటాయని చెబుతారు వాతావరణ పరిశోధకులు. ఇక్కడ లోతు తక్కువగా ఉంటూ ఒక వైపుకు తీర ప్రాంతం వంగినట్లు ఉండి పల్లంగా ఉంటుంది.సాధారణంగా తుపాను సమయంలో వీచే బలమైన గాలులు నీటిని బలంగా ఒడ్డువైపుకు తోస్తాయి. ఫలితంగా అలల వేగం ఒక్కసారిగా పెరిగి నేరుగా తుపాను తీరాన్ని తాకుతుంది.బంగాళాఖాతం ఉపరితలంలో ఉష్ణోగ్రతలు ఎప్పుడూ అధికంగా ఉండటం కూడా ఈ పరిస్థితికి ఒక కారణం. ఫలితంగా తీవ్ర తుపానులు సంభవిస్తుంటాయి."అక్కడ ఉష్ణోగ్రతల స్థాయి చాలా ఎక్కువ" అని భారత వాతావరణ పరిశోధన విభాగ అధిపతి డి.మహాపాత్ర వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ తరహా పెను తుపానులు సంభవించే మరికొన్ని తీర ప్రాంతాలు కూడా ఉన్నాయి. అందుకు ఉదాహరణ లూసియానాలోని గల్ఫ్ తీర ప్రాంతం."కానీ బంగాళాఖాతపు ఉత్తర తీర ప్రాంతంలో తుపానులు ఒక్కసారిగా విరుచుకుపడి పెను నష్టానికి కారణమవుతాయి. భూమిమీద ఇంకెక్కడా ఇంత దారుణమైన పరిస్థితులు తలెత్తవు" అని హెన్సన్ అన్నారు.తూర్పు తీర ప్రాంతంలో జనసాంద్రత అధికంగా ఉండటం కూడా తీవ్ర నష్టానికి కారణమవుతోంది. ఇక ప్రపంచవ్యాప్తంగా ప్రతి నలుగురిలో ఒకరు తీర ప్రాంతాల్లోనే ఉంటున్నారు.తుపానుల వల్ల అనేక విపత్తులు ఎదురవుతాయి. బలమైన గాలుల కారణంగా భౌతిక నష్టం ఎక్కువగా ఉంటుంది. అలాగే సముద్రంలో అలల పోటు తీవ్రంగా ఉంటుంది ఈ రెండింటితో పాటు భారీ వర్షాలు జన జీవనాన్ని అస్తవ్యస్థం చేస్తాయి.సాధారణంగా బంగాళాఖాతంలోనూ, అరేబియా సముద్రంలో తరచూ తుపానులు వచ్చినా ప్రతి పదేళ్లకు ఒకసారి మాత్రమే ఈ స్థాయి తుపానులు విరుచుకుపడుతుంటాయి. మన భారతదేశ భౌగోళిక స్వరూప దృష్ట్యా మనం ఈ తూఫాన్లను చూస్తూ ఉంటాం. సాధారణంగా ఇవి భూమధ్య రేఖకు 500 కిమీ నుండి 25000 కిమీ ల మధ్య మాత్రమే ఏర్పడతాయి. అందుకే వీటిని మనం ఉష్ణ మండల తూఫాను గా సంబోధిస్తాము.తూఫాను అన్నది సముద్ర జలాల పై ఏర్పడే అల్ప పీడన ప్రాంతమే. కానీ ఇక్కడ కేంద్రం చుట్టూ ఉన్న ఎన్విరాన్మెంట్ కన్నా వెచ్చగా ఉండి అపసవ్య గడియార దిశలో తిరుగుతూ ఉంటుంది. ఇక్కడ నేను అతి తక్కువ శాస్త్రీయ పదాలు ఉపయోగించి అందరికీ అర్థం అయ్యేలా రాయడానికి ప్రయత్నిస్తాను.తూఫాను ఏర్పడడానికి ముందు కచ్చితంగా ఈ క్రింద తెలపడిన అంశాలు ఉండి తీరాలి.ముందుగా సముద్ర ఉపరితల జల ఉష్ణోగ్రత కచ్చితంగా 26.5 డిగ్రీ సెంటిగ్రేడ్ కన్నా ఎక్కువ ఉండాలి.సముద్ర వాతావరణం గా ఉండాలివాతావరణ మధ్య పొరలలో ఎక్కువ ఆర్ద్రత లభించాలి.కరియోలిస్ ఫోర్స్ (ఇది తూఫాను అపసవ్య గడియార దిశలో తిరిగేందుకు) ఒక దృఢమైన వాతావరణ అలజడి (అల్ప పీడన ప్రాంతం)ఎప్పుడైతే పైన తెలుపబడిన అంశాలు వాతావరణం లో లభ్యమవుతాయో అప్పుడు ఒక అల్ప పీడనం తూఫాను గా రూపాంతరం చెందడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి. ముందుగా వెచ్చని తేమతో కూడిన సముద్ర ఉపరితల గాలులు వాతావరణంపై పొరలలోకి వెళ్ళేటప్పుడు తక్కువ సాంద్రత కలిగిన గాలిని క్రింది వాతావరణ పొరల్లో వదిలేస్థాయి. కాబట్టి అక్కడ అల్ప పీడన ప్రాంతం ఏర్పడుతుంది. ఎప్పుడయతే ఈ అల్ప పీడన ప్రాంతం ఏర్పడిందో, దానికి చుట్టూ ఉన్న గాలి ఆ ప్రాంతం లోకి వచ్చి అది కూడా తేమను సంగ్రహించి పై పొరలలో కి వెళ్తుంది. ఈ ప్రక్రియ అలా జరుగుతూ ఉంటుందిఎప్పుడైతే ఈ వెచ్చనైన తేమతో కూడిన గాలి పై పొరలలో చల్లర్చబడినదో, వెంటనే మేఘాలు ఏర్పడుతాయి. ఆ పై సముద్ర ఉష్ణ శక్తి మరియు ఉష్ణ ఎవాపొరేషన్ దోహదపడి, కారియోలిస్ ఫోర్స్ కారణంగా ఈ మేఘాలు అప గడియార దిశలో తిరగడం ప్రారంభిస్తాయి.ఈ మేఘాలు, వాతావరణ అనుకూల స్థితుల దృష్ట్యా మరింత వేగం గా తిరుగుతాయి. ఇలా తిరగడం వలన ఉపరితల గాలుల తీవ్రత అధికంగా ఉంటాయి. ఈ ఉపరితల గాలులు (10ఎ ఎత్తు వద్ద) ఎప్పుడైతే 34 నాట్స్ (1 నాట్ = 0.514 ఎ/బ) చేరతాయో అప్పుడు ఆ వాతావరణ స్థితిని తూఫాను గా ప్రకటిస్తారు.ఈ గాలుల తీవ్రత నిర్దిష్ట పరిమితి దాటిన తర్వాత వాటి యొక్క స్థాయిని వాతావరణ శాఖ వారు వేరు వేరు స్టేజ్ లుగా ప్రకటిస్తారు.ఉష్ణ మండల తూఫాను (34 నుండి 47 నాట్స్ వరకు)తీవ్ర తుఫాను (48 నుండి 63 నాట్స్ వరకు)అతి తీవ్ర తుఫాను (64 నుండి 89 నాట్స్ వరకు)అత్యంత తీవ్ర తుఫాను (90 నుండి 119 నాట్స్ వరకు)మహా తూఫాను (120 నాట్స్ నుండి)ఈ తుఫాను ఎప్పుడైతే భూ భాగం పై కి వస్తుందో (ఈ పక్రియ ను తీరం దాటడం గా అభివర్ణిస్తారు) అప్పుడు ఈ భీకర ఉపరితల గాలులు మరియు అతి భారీ వర్షాల వల్ల తీవ్ర నష్టం కలిగిస్తుంది. అయితే తీరం దాటిన తరువాత నీటి లభ్యత లేక ఇవి క్రమేపీ వాటి తీవ్రతను కోల్పోతూ చివరకు నశిస్తాయి.1970 నవంబర్లో వచ్చిన సైక్లోన్ భోలా ప్రపంచ చరిత్రలోనే అత్యంత ఘోరమైన తుపానుల్లో ఒకటి. బంగాళాఖాతంలో సంభవించిన ఈ తుపాను కారణంగా సుమారు 50 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ తుపాను సమయంలో తీర ప్రాంతంలో అలలు సుమారు 34 అడుగుల ఎత్తున ఎగసిపడ్డాయి.గడిచిన కొన్ని దశాబ్దాలుగా బంగాళాఖాతంలో సంభవించే తుపానుల తీవ్రత పెరుగుతూ వస్తోంది.2008 మే నెలలో బర్మా తీరంలో సంభవించిన 'నర్గిస్' తుపాను కారణంగా సుమారు లక్షా 40 వేల మంది ప్రాణాలు కోల్పోగా, 20 లక్షల మంది నిరాశ్రయులయ్యారు.చివరిసారిగా 1999లో సూపర్ సైక్లోన్ భారత్‌లో ఒడిశా రాష్ట్రాన్ని తాకింది. ఆ తుపాను ధాటికి సుమారు 10 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఎటు చూసినా కుళ్లిన శవాలు, శ్మశానాల్లో ఆకాశాన్ని అంటుతున్న పొగ.. అప్పట్లో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రయాణించిన నాకు కనిపించిన దృశ్యాలవి. నాటి భయానక పరిస్థితి ఇప్పటికి నాకు గుర్తుంది. ఓ సూపర్ సైక్లోన్ ధాటికి పరిస్థితులు ఎంత దారుణంగా తయారవుతాయో మొదటిసారిగా అప్పుడే తెలిసింది.

# దటీజ్ చంద్రబాబు


## 70 ఏళ్ల వయస్సులో చాలెంజ్



**విజయవాడ, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** 10 సంవత్సరాల వయసులో ఉన్న ఉత్సాహం 20 సంవత్సరాల వయసులో ఉండదు. ఇలా వయసు మారుతున్న కొద్దీ మనుషులలో మార్పులు వస్తుంటాయి. ఇది సహజంగా జరిగే ప్రక్రియే. కానీ కొంతమంది వయసు వెనక్కి పంపించేస్తుంటారు. తమ ఉత్సాహం ముందు.. తమ క్రమశిక్షణముందు వయసును చిన్నబోయేలా చేస్తారు. అటువంటి వారిలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒకరు. వాస్తవానికి ఈ జాబితాలో చంద్రబాబు నాయుడు కు మొదటి స్థానం ఇవ్వాల్సి ఉంటుంది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడుల కోసం నాడు చంద్రబాబు నాయుడు అనేక దేశాలు తిరిగారు. మైక్రోసాఫ్ట్ అనే సంస్థను హైదరాబాద్ తీసుకొచ్చారు. మైక్రోసాఫ్ట్ ద్వారా ఐటీకి ఒక ఎకో సిస్టం డెవలప్ చేశారు. ఈరోజు హైదరాబాద్ ఐటి విభాగంలో ఈ స్థాయిలో అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం చంద్రబాబు నాయుడు అనడంలో ఎటువంటి అనుమానం అక్కర్లేదు. ఈ విషయాన్ని అనేకమంది ముఖ్యమంత్రులు.. అనేకమంది నాయకులు ఒప్పుకున్నారు. చంద్రబాబు నాయుడు మొదటినుంచి కూడా ఆహారం తీసుకునే విషయంలో కట్టుదిట్టంగా ఉంటారు. ఏమాత్రం దానిని బ్రేక్ చేయరు. ఆయనకు ఎంతో కాలం నుంచి మధుమేహం ఉంది. అయినప్పటికీ అయినప్పటికీ దానిని నియంత్రణలో ఉంచుకుంటున్నారు. చంద్రబాబు ఎట్టి పరిస్థితుల్లో కూడా అన్నం తినరు. కేవలం తృణధాన్యాలను మాత్రమే ఆహారంగా తీసుకుంటారు. కాఫీ తాగుతారు. గ్రిల్డ్ ఫిష్ తీసుకుంటారు. నాన్ వెజ్ విషయంలో ఆయనకు చాలా లెక్కలు ఉంటాయి. ప్రతిరోజు ఉదయం వ్యాయామం చేస్తారు. యోగా చేస్తారు. మెడిటేషన్ కూడా చేస్తారు. అందువల్ల చంద్రబాబు ఏడుపదుల వయసు దాటినప్పటికీ కూడా ఉత్సాహంగా కనిపిస్తుంటారు. ప్రతి విషయాన్ని కూడా గుర్తుంచుకుంటారు. ఆ విషయాన్ని చెప్పడానికి ఏమాత్రం సంకోసించరు.చంద్రబాబు ప్రస్తుతం విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. అమరావతి ప్రాంతంలో రాజధాని నిర్మించడానికి వేగంగా అడుగులు వేస్తున్నారు. కేంద్రంలో అనుకూలమైన ప్రభుత్వం ఉన్నప్పటికీ చంద్రబాబు స్వీయ శక్తిని నమ్ముకుని ముందుకు వెళ్తున్నారు. ఈ వయసులో కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రాంతంలో అనేక దేశాలను తిరిగివచ్చారు. అమరావతి ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న పెట్టుబడుల సదస్సుకు రావాలని అక్కడి కంపెనీల అధిపతులను కోరారు. అక్కడి ప్రభుత్వ అధినేతలను విన్నవించారు. అమరావతిలో భారీగా విదేశీ సంస్థలను తమ కార్యకలాపాలు ప్రారంభించే దిశగా చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకరకంగా ఇది సానుకూల అంశం. ఏపీ రాష్ట్రానికి మరింత సానుకూల అంశం. రాజకీయాల విషయాలను పక్కన పెడితే చంద్రబాబు ఈ వయసులో కూడా అక్కడికి వెళ్లడం ఒకరకంగా అద్భుతం అని చెప్పాలి. ప్రత్యేకమైన విమానాలు ఉన్నప్పటికీ.. అనేక రకాల సౌకర్యాలు ఉన్నప్పటికీ ఈ వయసులో ఆయన అక్కడికి వెళ్లడం మిరాకిల్ అనడంలో ఎటువంటి సందేహం లేదు.కొన్ని రాష్ట్రాలలో చంద్రబాబు కంటే తక్కువ వయసు ఉన్నవారు.. చంద్రబాబుతో సమానంగా వయసు ఉన్నవారు.. చంద్రబాబు కంటే ఎక్కువ వయసు ఉన్నవారు ముఖ్యమంత్రులుగా పనిచేస్తున్నారు. కానీ చంద్రబాబు మాదిరిగా ఎవరూ పెట్టుబడుల కోసం ఇతర దేశాలకు వెళ్లడం లేదు. ఇతర దేశాల కంపెనీల ప్రతినిధులను ఒప్పించడం లేదు. అన్నింటికంటే ముఖ్యంగా రాష్ట్ర అభివృద్ధి విషయంలో అహర్నిశలు శ్రమించడం లేదు. సాధారణంగా ఒక వయసుకు వచ్చిన తర్వాత చాలామంది ఉత్సాహంగా పనిచేయలేరు.ముఖ్యంగా 70 సంవత్సరాల వయసు దాటిన తర్వాత చాలామంది రిలాక్స్ అవ్వాలని కోరుకుంటారు. వయసు వల్ల వచ్చిన నీరసం కూడా ఇబ్బంది పెడుతూ ఉంటుంది. కానీ చంద్రబాబుకు అలసట అనేది తెలియడం లేదు. నీరసమనేది దరిచేరడం లేదు. ఈ వయసులో కూడా ఆయన ఎంతో ఉత్సాహంగా పనిచేస్తున్నారు. తన కలల రాజధాని కోసం విపరీతంగా శ్రమిస్తున్నారు. కేంద్రం నుంచి మొదలుపెడితే విదేశాల వరకు ఆయన అన్ని తలుపులను కూడా తడుతున్నారు. ఉజ్వలమైన ఏపీ కోసం బలమైన అడుగులు వేస్తున్నారు. ఒక నాయకుడు అనే వాడు బలమైన సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. దృఢమైన ఆలోచనలను అమలు చేయాలి. అప్పుడే ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుంది. ఇప్పుడు చంద్రబాబు చేస్తోంది కూడా అదే.

# కూటమి సర్కార్‌లోనూ ఫ్యాన్ నేతలు చక్రం





**రాజమండ్రి, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయి పదిహేడు నెలలవుతుంది. అయితే ఇప్పటికీ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నది వైసీపీ నియమించిన వారేనట. ఈ మాటలన్నది ఎవరో కాదు. స్వయానా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చెప్పారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వైసీపీ నేత ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ప్రతి జిల్లాలో తన మనుషులను నియమించుకున్నాని, వారే జిల్లాల్లో ఇప్పటికీ రేషన్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని కొలికపూడి శ్రీనివాసరావు చెప్పుకొచ్చారు. కృష్ణా జిల్లాలోనూ రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నది గత ప్రభుత్వ హయాంలో కొడాలి నాని వద్ద ఉన్న ఒక వ్యక్తి అని, అతనే ఇప్పుడు కేశినేని చిన్ని కార్యాలయంలో కూర్చుని ఈ మాఫియాను నడుపుతున్నారని ఆయన తీవ్రమైన ఆరోపణలు చేశారు. కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఆయనకు రాష్ట్ర రాజకీయాలపై ఒక అవగాహన ఉందని అంటున్నారు. అందుకే ఆయన చేసిన ఆరోపణలను ఇప్పుడు టీడీపీ సోషల్ మీడియాలో కూడా కొందరు వ్యతిరేకిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి దాదాపు రెండేళ్లు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ వైసీపీ నేతల మనుషులే రేషన్ బియ్యం మాఫియాను నడుపుతుండటం సిగ్గుచేటని కామెంట్స్ పెడుతున్నారు. వైసీపీ నేతలను అరెస్ట్ చేయాల్సిందిబోయి వారిని అక్కున చేర్చుకోవమేంటని టీడీపీ అభిమానులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇలా అయితే వైసీపీ పాలనకు, కూటమి పాలనకు తేడా ఏముందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ప్రతి జిల్లాలో ఒక మనిషిని ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి నియమించుకున్నారని, వారి ద్వారా రేషన్ డీలర్ల ను బెదిరించి ఇతర రాష్ట్రాలకు రేషన్ బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నారని కొలికపూడి శ్రీనివాసరావు చేసిన ఆరోపణలపై ఇప్పుడు జనసేనకు కూడా చుట్టుకుంది. జనసేనకు చెందిన నాదెండ్ల మనోహర్ పౌరసరఫరాల శాఖ మంత్రిత్వ శాఖను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే నెల్లూరు జిల్లా నేత కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చేసిన వ్యాఖ్యలు నాదెండ్లకు ఆగ్రహాన్ని తెప్పించాయి. తాజాగా కొలికపూడి చేసిన వ్యాఖ్యలతో ఆయన మరింత కోపానికి గురయినట్లు తెలిసింది. మొత్తం మీద కూటమిలో ఇప్పటికీ వైసీపీ నేతల హవా నడుస్తుందన్న కొలికపూడి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలు కూటమి పార్టీల్లో మంటలు రేపుతున్నాయి. చంద్రబాబు వచ్చిన తర్వాత దీనికి ఫుల్ స్టాప్ పడుతుందని భావిస్తున్నారు.

# ఉత్తరాంధ్ర వైసీపీ నేతలు...అత్యుత్సాహం



**విశాఖపట్టణం, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** ఊరికి ముందే ఉత్తరాంధ్ర వైసీపీ నాయకత్వం గూగుల్ డేటా సెంటర్‌కు వ్యతిరేక స్వరం వినిపించింది. అదో గోడౌన్ తప్ప ఉపయోగం లేదని ఒకరు, దానివల్ల వైజాగ్‌లో టెంపరేచర్ పెరుగుతుందని మరొకరు, అలాంటి ప్రాజెక్ట్ వస్తే? ఇంకేదో జరిగిపోతుందని ఇంకొకరు?. రకరకాలుగా కామెంట్స్ చేశారు. అదే సమయంలో ప్రభుత్వం సహజంగానే ఈ ప్రాజెక్ట్‌కు బీభత్సమైన ఎలివేషన్ ఇచ్చింది. వైసీపీవాళ్ళకు సరిగా తెలియక ఏదేదో మాట్లాడుతున్నారుగానీ? గూగుల్ డేటా సెంటర్ వల్ల వైజాగ్‌లో ఒక ఎకో సిస్టం డెవలప్ అవుతుందని, మిగతా సాఫ్ట్‌వేర్ కంపెనీలు రావడానికి రూట్ క్లియర్ అవుతుందని క్లారిటీ ఇస్తున్నారు ప్రభుత్వ పెద్దలు. ఈ కన్ఫ్యూజన్‌లో? ఎవర్ని నమ్మాలో అర్థంకాని స్థితిలో ప్రజలు ఉండగానే?. వైసీపీ అధినేత జగన్ తాజాగా మాట్లాడిన మాటల చుట్టూ కొత్త చర్చ మొదలైంది.ఓవైపు ఉత్తరాంధ్ర నాయకులు వ్యతిరేక కామెంట్స్ చేస్తే? జగన్ మాత్రం డేటా సెంటర్స్‌కు అనుకూల స్వరం వినిపించారు. ఒకే ఇష్యూపై డిఫరెంట్ వెర్షన్స్ రావడంతో పార్టీ ప్రయోగించాలనుకున్న రాజకీయ అస్త్రం రివర్స్ అయిందా అనే చర్చకు తెరలేచింది. సరిగ్గా ఇదే పాయింట్‌ని వాడుకుంటూ? సర్కార్ వైపు నుంచి కూడా ఆల్రెడీ అటాక్ మొదలైపోయింది. వైసీపీ నేతలు దాగుడు మూతలతో జనాన్ని మభ్య పెట్టవద్దంటూ ప్రభుత్వం ఎదురు దాడి స్టార్ట్ చేసింది. నువ్వా నేనా అన్నట్టుగా ఉండే పొలిటికల్ సిచ్యుయేషన్స్‌లో ఏ మాత్రం తడబడ్డా? సంకట స్థితి తప్పదు. డేటా సెంటర్ల విషయంలో వైసీపీ ఇప్పుడు అదే స్థితిలోకి వెళ్ళిపోయిందా అంటూ మాట్లాడుకుంటున్నారు. ఎక్కువ మంది. ఉద్యోగాలు, పర్యావరణ పర్యవసానాల చర్చల్ని కాసేపు అలా ఉంచితే? అమెరికా బయట గూగుల్ ఇంత భారీ ప్రాజెక్టు ఏర్పాటు చేయడం ఇదే మొదటి సారి. లక్షా 30వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెడుతున్నట్టు ప్రకటించింది. దాన్ని బేస్ చేసుకునే? విశాఖను ఏఐ సిటీగా మార్చేందుకు ఈ డేటా సెంటర్ పునాది అంటూ ప్రభుత్వం ప్రమోట్ చేస్తోంది. ఐతే? ఇందులోకి క్రెడిట్ పాలిటిక్స్ ఎంటరవడంతో మేటర్ రసకందాయంలో పడింది.గూగుల్ డేటా సెంటర్ గురించి ప్రభుత్వం విపరీతంగా ప్రచారం చేసుకుంటోందని, వాళ్ళు చెబుతున్నట్టు లక్షల ఉద్యోగాలన్నది అభూతకల్పన అంటూ విభేదించారు ఉత్తరాంధ్ర వైసీపీ నాయకులు. ఆ విషయంలో కాస్త దూకుడు ప్రదర్శించి గట్టి స్టేట్‌మెంట్సే ఇచ్చేశారు. ఆ పొలిటికల్ గేమ్ అలా నడుస్తుండగానే? తాజాగా మీడియాతో మాట్లాడిన పార్టీ అధ్యక్షుడు జగన్? డేటా సెంటర్స్‌ని మేం వ్యతిరేకించడం లేదు, స్వాగతిస్తున్నామని ప్రకటించారు. పైగా అదానీ డేటా సెంటర్‌కు పునాది వేసింది వైసీపీనేనని క్లారిటీ ఇచ్చేశారాయన. దీంతో మేటర్ కీలక మలుపు తిరిగింది. పార్టీ హైకమాండ్ ఆలోచనలకు, ఉత్తరాంధ్ర నాయకత్వానికి మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ ఉందా? లేక పార్టీ విధానం ఏంటో తెలుసుకోకుండా వాళ్ళు తొందరపడ్డారా అన్న అనుమానాలు వస్తున్నాయట పరిశీలకులకు. వాస్తవంగా? విశాఖలో డేటా సెంటర్ల ఏర్పాటు దిశగా తొలి అడుగు వైసీపీ హయాంలోనే పడింది. మధురవాడ ప్రాంతంలో300 మెగావాట్ల అదానీ డేటా సెంటర్‌కు 2023లో సీఎం హోదాలో శంఖు స్థాపన చేశారు జగన్మోహన్‌రెడ్డి.కేవలం డేటా సెంటర్ ఒక్కటే కాకుండా ఐటీ అనుబంధ పెట్టుబడులు పెట్టే విధంగా అప్పట్లో ప్రభుత్వంతో ఒప్పందం కుదిరింది. అయితే? ప్రస్తుతం గూగుల్ ఏర్పాటు చేయబోతున్నది ఒక గిగావాట్ కెపాసిటీ. స్టోరేజ్ సామర్థ్యం, పెట్టుబడి పరంగా రెండు ప్రాజెక్టుల మధ్య పొంతన లేకున్నా? ఇదే విశాఖలో డేటా సెంటర్‌కు వైసీపీ హయాంలో శంకుస్థాపన జరిగిందన్నది మాత్రం వాస్తవం. ఉత్తరాంధ్ర వైసీపీ నాయకులు ఆ సంగతి మర్చిపోయి గూగుల్‌పై విమర్శలు చేసి తొందర పడ్డారా అన్న చర్చలు మొదలయ్యాయి రాజకీయవర్గాల్లో. గూగుల్‌కు తాము వ్యతిరేకం కాదంటూనే? డేటా సెంటర్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో? ప్రభుత్వం కూడా ఎదురు దాడి ప్రారంభించింది. వైసీపీ అభివృద్ధికి వ్యతిరేకం కనుకనే గూగుల్‌ను ఆహ్వానించడానికి మనసు రావడం లేదని, ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శిస్తున్నారు అధికారపక్ష నేతలు. మొత్తం మీద ఈ విషయమై వైసీపీలో కమ్యూనికేషన్ గ్యాప్ ఉందన్న విషయం మాత్రం అర్థమవుతోందని అంటున్నారు పరిశీలకులు.

Truth of News
RNI NO : APTEL/25/A0239
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



## దివ్యాంగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు

- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అనంతపురం కలెక్టరేట్, సూర్య వాస్తవం, అక్టోబర్ 27 :** విభిన్న ప్రతిభావంతుల చట్టం సమర్ధవంతంగా అమలయ్యే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. సోమవారం అనంతపురంలోని కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వికలాంగుల హక్కులు చట్టం 2016, ఆంధ్రప్రదేశ్ వికలాంగుల హక్కులపై జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏ ఒక్క దివ్యాంగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని, అలాగే అన్ని శాఖలలో దివ్యాంగులకు సంబంధించి రిజర్వేషన్ అమలు జరగాలని ఈ చట్టంలో పొందుపరచడం జరిగిందని తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయా శాఖల జిల్లా అధికారులకు, ఎస్హెచ్ఓలకు చట్టంలో ఉన్న నియమాలను గురించి అందరికీ అవగాహన కల్పించాలని, చట్టం ఉల్లంఘనకు ఎలాంటి వీలులేదని ఆదేశించారు. స్కిల్ డెవలప్మెంట్ నుంచి దివ్యాంగుల శిక్షణ ఇవ్వాలని, షెడ్యూల్ ఏర్పాటు చేసుకొని శిక్షణలు అందించాలని, శిక్షణ గురించి అందరికీ తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ ఎన్.రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో దివ్యాంగులకు మరియు జిల్లా అధికారులకు న్యాయ సేవ సధన్ లో ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని, దివ్యాంగులకు సహాయం కావలసివస్తే సహాయానికి ముందుంటామని తెలిపారు. జిల్లాలో ఓల్డేజ్ హోమ్ సంస్థలను అత్యవసర తనిఖీలు చేస్తామని, తనిఖీలు చేసినప్పుడు సంబంధిత అధికారులు తగిన సహకారం అందించాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల చట్టంలో ఉన్న నియమాలను జిల్లా కలెక్టర్ సూచించిన విధంగా అమలు పరిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్జీవోలు, మరియు పి.డబ్ల్యు.డి కమిటీ సభ్యులు పలు సమస్యలను తెలియజేశారు. ఈ సమావేశంలో డిపిఓ నాగరాజు నాయుడు, జిల్లా పరిషత్ సీఈవో శివశంకర్, డిఆర్డిఏ పిడి శైలజ, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా.కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, మెప్మా పీడీ విశ్వ జ్యోతి, డీఈవో ప్రసాద్ బాబు, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, వాటాదారులు, ఎన్జీవోలు, మరియు పి.డబ్ల్యు.డి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## అమడగూరులో వైసీపీకి భారీ ఎదురుదెబ్బ

- టీడీపీలో చేరిన 20 కుటుంబాలు



**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** అమడగూరు మండలంలో వైసీపీ భారీ షాక్ తగిలింది, చినగాని పల్లి పంచాయతీ ఆకులవాండ్లపల్లికి చెందిన 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ లోకి చేరాయి. చినగాని పల్లి పంచాయతీ వైసీపీలో కీలకంగా ఉన్న హనుమంత్ రెడ్డి, ఎం హనుమంత రెడ్డి, డి భాస్కర్, జయరాం ,ఎం రామలింగారెడ్డి, ఎం భాస్కర్ రెడ్డి, జి అది,ఎం రామచంద్ర, జయరాం రెడ్డి, వి శివ, రామచంద్ర, రామయ్య, రాజశేఖర్ రెడ్డి, పి సుధాకర్ రెడ్డి తో పాటు పలువురు సోమవారం పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో టీడీపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే, మాజీ మంత్రి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్నా తమకి ఎలాంటి గుర్తింపు లేదని, తమ ప్రాంతం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేస్తున్న తీరు, స్థానికంగా ఎమ్మెల్యే సింధూర రెడ్డి పని తీరు చూసి టీడీపీలో చేరామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమడగూరు మండల టీడీపీ కన్వీనర్ గోపాల్ రెడ్డితో పాటు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## గుత్తి బాలికల పాఠశాలలో వన మహోత్సవం



**గుత్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** గుత్తి పట్టణములోని బాలికల పాఠశాల నందు హెచ్ఎం సుంకన్న,ఫారెస్ట్ రేంజ్ ఆఫీస ర్ మధుబాబు ఆధ్వర్యంలో కార్తీక వన మహోత్సవ కా ర్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆ ఫీసర్ మధుబాబు,పాఠశాల హెచ్ఎం సుంకన్న మాట్లా డుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరు తమ చుట్టు పక్కల ప్రాంతాల్లో మొక్కలు నాటాలని అవి మన భావిత రాలకు భవిష్యత్తునిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుంకన్న,ఫారెస్ట్ రేం జ్ ఆఫీసర్ మధుబాబు,ఫారె స్ట్ సెక్షన్ అధికారి నారపరెడ్డి, బీట్ అధికారి రమేష్ బాబు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# సమస్యలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించండి





## జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంతృప్తి స్థాయిలో వేగవంతంగా, నాణ్యతతో, బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశిం చారు. రాయచోటి కలెక్టరేట్లోని పిజి ఆర్ఎస్ హాలులో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పెండింగ్లో ఉన్న బియాండ్ ఎస్.ఎల్.ఏ. దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాల న్నారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రతి అర్జీని నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. నాణ్యతతో కూడిన పరిష్కార మార్గం చూపేలా అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి సమ స్యలను పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారం పై నేరుగా పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. ప్రతి సమస్యను మరియు ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాల న్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన కలిగి ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్య లను నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

**అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించిన జిల్లా కలెక్టర్**

ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్స్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీదారులు ఈ సౌకర్యాలను వినియోగించు కొని ఆనందం వ్యక్తం చేశారు.

**ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు**

రాయచోటి బోస్ నగర్ కు చెందిన షేక్ షబానా నాకు ప్రభుత్వంనుండి ఇంటి స్థలం కేటాయించినట్లు 230525042284గా ఆన్లైన్‌లో చూపుతున్నదని కానీ నాకు ఇప్పటివరకు ఎలాంటి ఇంటి పట్టాను ఇవ్వలేదని దయచేసి తమరు ఈ విషయాన్ని పరిశీలించి నాకు ఇంటి స్థలాన్ని ఇప్పించవలసిందిగా జిల్లా కలెక్టర్‌కు విన్నవించు కున్నారు. నిమ్మనపల్లి మండలం, ముస్తూరు నిమ్మనపల్లి గ్రామం పరిధిలోని కొండయ్యపల్లికు చెందిన ఎం రాజమ్మ, తన భర్త తేది.03.09.2009న మరణించడం జరిగిందని వితంతు పింఛను వస్తున్నదని ఇప్పుడు రావడం లేదని తను నిరుపేదనని కుటుంబ పోషణ కష్టంగా ఉందని తనకు వితంతు పింఛను పునరుద్ధరణ చేసి ఇప్పించవలసిందిగా జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. గుర్రంకొండ మండలం, తరిగొండ గ్రామ మజరా ఇరగన్నగారిపల్లి కు చెందిన తరిగొండ వెంకటహరినాధ్ మా ఊరుకి దక్షిణమున మా తండ్రి గారి పేరిట 1060 సర్వే నెంలో 13.83 సెంట్లపైకి 6,914లో అర్ధ భాగం డాక్యుమెంట్ నెం.221/1938, 01-03-1938 తేది మేరకు హక్కు కలదు కాని సదరు సర్వే నెంబర్లు 2.99 ఎకరాల విస్తీర్ణం మాత్రమే ఆన్లైన్లో నమోదు కలదు. మిగిలిన విస్తీర్ణం 0.47 సెంట్ల భూమిని మా తల్లి గారి పేరిట ఆన్లైన్లో నమోదు చేయాలని గత నెల 17 తేదిన గుర్రంకొండ మండల తహసీల్దార్‌కి సంబంధిత నకలు డాక్యుమెంట్లతో విన్నవించడం జరిగింది. కావున తమరు ఈ విషయాన్ని పరిశీలించి మా తల్లి పేరిట పైన తెలిపిన సర్వే నెం. 1060లో మాకు హక్కు కలిగిన విస్తీర్ణమును రీసర్వేలో మా తల్లి పేరిట నమోదు చేసి పాసుపుస్తకములు మంజూరు చేయవలసినదిగా జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. కలికిరి మండలం గుట్ట పాలెం గ్రామపంచాయతీ పరిధిలోని వాడ వాండ్లపల్లి కు చెందిన టి సునీత తనకు 79శాతం వికలాంగత్వం ఉన్నదని, తనకు దాదాపు 20 సంవత్సరంలగా వికలాంగుల పెన్షన్ వస్తుండేదని, నాలుగు సంవత్సరాల నుండి రావడం లేదని తమరు ఈవిషయాన్ని పరిశీలించి వికలాంగుల పెన్షన్ ఇప్పించ వలసిందిగా జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్,ఏడి సర్వే భరత్ కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను సహాయక చర్యలకు సిద్ధం


- జిల్లా ఎస్పీని కలిసిన 'స్కౌట్స్' అధికారులు



**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ని సోమవారం సాయంత్రం ఆయన కార్యాలయంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో స్కౌట్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాయచోటిలోని డైట్ కళాశాలలో 160 మంది ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్స్ శిక్షణా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని స్కౌట్ మాస్టర్, గైడ్ కెప్టెన్స్ కు స్ఫూర్తిని నింపాలని విన్నవించారు. "మోంతా" తుఫాను విపత్తును ఎదుర్కొనుటలో జిల్లా యంత్రాంగానికి సహాయ సహకారాలను అందించేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్లు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓసి లక్ష్మీకర్, స్కౌట్ జిల్లా ట్రెజరర్ మార్ల ఓబుల్ రెడ్డి, యువ ఆపదమిత్ర నోడల్ ఆఫీసర్ గురునాథరెడ్డి, స్కౌట్ యూనిట్ లీడర్లు ఖాదర్ బాషా, గోపీనాథ్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శాంతి, నారాయణమ్మలు పాల్గొన్నారు.



## వరకట్న వేధింపులపై ఎస్పీకి ఫిర్యాదు



**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** అదనపు కట్నం తీసుకురావాలని తన భర్త వెంకట శివ, అత్త సుంకమ్మ, మామ వెంకటేష్, మరది అంజి, ఆడపడుచు శ్రీలక్ష్మి, ఆమె భర్త ప్రసాద్ ప్రతిరోజూ వేధిస్తున్నారని వివాహిత బి . శైలజ సోమవారం నాడు పోలీస్ గ్రీవెన్స్ లో జిల్లా ఎస్పీ పి . జగదీష్ కు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గార్లదిన్నె మండలంలోని ఎం.పి.ఆర్ డ్యామ్ గ్రామానికి చెందిన వెంకట శివ తో వివాహం జరిపించారనీ ...వివాహ సమయంలో తన తల్లి 9 తులాల బంగారు ఇచ్చి వారి స్తోమత మేరకు వివాహం జరిపారనీ తన భర్త బేల్దారు పని చేస్తూ నేను కూడా బేల్దారు పని చేస్తూ జీవిస్తున్నామని అయితే తన భర్త తో పాటుగా,నా అత్త సుంకమ్మ నా మామ వెంకటేష్, నా మరిది అంజి, నా ఆడపడుచు శ్రీలక్ష్మి, శ్రీ లక్ష్మి భర్త ప్రసాద్ మొదలగు వారు "అదనపు వరకట్నం" కొరకు తనను విపరీతంగా కొడుతూ వేధిస్తున్నారని ఆమె తెలిపింది. తన సంసారము బయట పడకూడదని ఓపికతో, సంసారం చేస్తూ వుండగా, ఈ మధ్య కాలంలో మరీ ఎక్కువగా వేధింపులకు గురి చేశారని . వారు పెట్టిన మానసి క్షోభకు తట్టుకోలేక, చనిపోవాలని "కెనాల్" లో దూకి ఆత్మహత్య కు పాల్పడిందని కెనాల్ నీళ్ళలో కొట్టుకు పోతున్న తనని బాటసారి కాపాడాడు అని జిల్లా ఎస్పీ పి .జగదీష్ కు బి. శైలజ తన గోడును తెలిపింది.

## పుట్టపర్తిలో పలు అభివృద్ధి పనులకు

# భూమి పూజ





**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** మున్సిపాలిటీ పరిధిలోని చిత్రావతి రోడ్డు ప్రాంతాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పరిశీలించారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి శత జయంతి సందర్భంగా పుట్టపర్తిని సుందరంగా తీర్చి దిద్దాలని అధికారులను ఆదేశించారు. సుందరీకరణలో భాగంగా చిత్రావతి బ్రిడ్జ్‌పై ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ దీపాల ఏర్పాటు పనులను మరియు చిత్రావతి రోడ్డు మరమ్మతు పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. అలాగే ఉదయం పుట్టపర్తి పట్టణంలోని మెయిన్ రోడ్డులో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు మరియు విద్యుత్ తీగల క్రమబద్ధీకరణ పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే, మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# న్యాయం చేయాలంటూ హిజ్రాల ధర్నా

## పోలీసుల కాళ్లు పట్టుకుని వేడుకోలు




**గుంతకల్, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** తమకు న్యాయం చేయాలంటూ అనంతపురం జిల్లా గుంతకల్ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం ఎదుట హిజ్రాలు నిరసన చేపట్టారు. అనంతపురానికి చెందిన ఆసిఫా అనే వ్యక్తి తమను ఎనిమిది నెలలుగా టార్చర్ పెడుతున్నారని లక్షలకు లక్షలకు కావాలంటూ బెదిరిస్తున్నాడన్నారు. డబ్బు ఇచ్చినా ఇంకా కావాలంటూ బెదిరింపులకు గురిచేస్తున్నాడని ఇవ్వని పక్షంలో ఇళ్లల్లోకి దూరి సామగ్రిని ధ్వంసం చేసి, చంపుతానంటూ బెదిరిస్తున్నాడన్నారు. మీరు ఏ స్టేషన్‌కి వెళ్లినా న్యాయం జరగదు.. ఆ స్టేషన్లకు నేను కొనేశాను.. పైఆఫీసర్‌కి కంప్లైంట్ ఇచ్చేకి వెళితే కిడ్నాప్ చేసి వారి చేతి మీద ఈ వీపు మీద కత్తితో కోసి భయపెడుతున్నాడు.. మేము ఆధారాలతో సహా ఇస్తున్నాము వెంటనే ఆ వ్యక్తిని అరెస్టు చేయాలని కోరారు. లేదంటే తాము ఆత్మహత్య చేసుకోవాల్సిందేనని వాపోయారు. కొందరైతే పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. ఇకనైనా ఆసిఫా నుంచి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని పోలీసుల కాళ్లు పట్టుకొని వేడుకున్నారు.




# సీపీఎం విధానాలే దేశాభివృద్ధికి మార్గదర్శకం

## కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి - మండెం సుధీర్ కుమార్‌తోపాటు పలువురు సీపీఎంలో చేరిక



**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** సుదీర్ఘకాలం పాటు వివిధ వామపక్ష పార్టీలలో, కమ్యూనిస్టుపార్టీల అనుబంధ సంఘాలలో, క్రియాశీలకంగా పనిచేసి, వామపక్ష పార్టీల విధానాలన్నింటికంటే, సిపిఎం పార్టీ విధానాలే ఈ దేశ అభ్యున్నతికి ప్రత్యామ్నాయం, ఆదర్శమని భావించిన మండెం సుధీర్ కుమార్ తో పాటు మరికొంతమంది నేడు రాయచోటి పట్టణంలోని స్థానిక భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఐ (ఎం) ఆఫీసులో, ఆ పార్టీ కేంద్ర కమిటీ, మరియు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి, అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసులు సమక్షంలో పార్టీలో చేరడం జరిగింది. పార్టీలో చేరిన వారికి రమాదేవి కండువాలు వేసి ఆహ్వానించడం జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ, సిపిఎం తో ప్రారంభించి సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్,లిబరేషన్, సిపిఐ వంటి వామపక్ష కమ్యూనిస్టు పార్టీలలో సుమారు 20 సంవత్సరాలు కాలం పాటు క్రియాశీలకంగా పనిచేసిన మండెం సుధీర్ కుమార్, తనతో కలిసి ఉద్యమాలలో పాల్గొన్న కొంతమంది, చివరికి ప్రజా అనుకూల విధానాలను అవలంబించే ఏకైక రాజకీయ పార్టీ సిపిఎం నే అని, ప్రజా సమస్యల పట్ల నిజాయితీగా, నికరంగా సిపిఎం మాత్రమే పోరాడుతున్నదని భావించి, విశ్వసించి తిరిగి పార్టీలోనికి రావాలని నిర్ణయించుకోవడం మంచి పరిణామం అని అన్నారు. సుధీర్ కుమార్ తో పాటు అతనితో కలిసి ఉద్యమాలలో పాల్గొన్న చుక్క వీరభద్ర, వండాడి రెడ్డి సుధాకర్, పులిమి వెంకటరమణ, గాలివీటి రామాంజులు, మధ్యాహ్నపు పండరయ్య, పరస రెడ్డి ప్రసాద్, నరసింహులు తదితరులను పార్టీలోకి ఆహ్వానించి, చేర్చుకోవడం జరిగిందని తెలిపారు. నేడు దేశంలో, రాష్ట్రంలో ఏర్పాటైన ప్రభుత్వాలు మనువాద మతోన్మాద విధానాలను అవలంబిస్తూ, ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, ప్రజలకు అనేక రకాల ఇబ్బందులను కలిగిస్తున్నాయని తెలిపారు. మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడిదారులకు కారు చౌకగా అమ్మేస్తుంటే, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నోరెత్తకపోగా, ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. రానున్న రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవళంబిస్తున్న, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు నిర్వహించడానికి ప్రజానీకాన్ని పెద్ద ఎత్తున కదిలించి ఉద్యమించడానికి తగిన విధంగా పథక రచన చేసుకొని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ చంద్రశేఖర్, పందికాళ్ళ మణి, రైతు సంఘం జిల్లా కన్వీనర్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు..

## ప్రజలంతా అధికారుల సూచనలు పాటించాలి

- ఎస్సై నాగమధు



**కనేకల్, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** కనేకల్ మండల పరిధిలోని కనేకల్- మాల్యం గ్రామాల మధ్య ప్రవహించే వేదావతి-హగరి నదికి సోమవారం సాయంత్రం భారీ ఎత్తున నీటి ప్రభావం పెరిగింది ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై వాహనదారులు, ప్రజలు హగరి వైపుకు వెళ్ళకుండా సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నాగ మధు ఆధ్వర్యంలో మరియు విలేజ్ రెవెన్యూ అధికారి పవన్, రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది కలిసి సోమవారం సాయంత్రం రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్ ను పెట్టడం జరిగినది.నది ఒడ్డున ఎవరూ వెళ్లకుండా పోలీసు సిబ్బంది నిఘా కూడా ఏర్పాటు చేశారు.ఎస్సై నాగమధు మాట్లాడుతూ "నదిలో వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున, చిన్నపిల్లలు, ప్రజలు నది పరివాహక ప్రాంతాలకు వెళ్లకూడదు. వాహనదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేదావతి హగరీ దాటడానికి ప్రయత్నించరాదు" అని హెచ్చరించారు.

## తుఫాన్ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ప్రత్యేక అధికారి అరుణ బాబు

**నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** మొంథా తుఫాన్ పట్ల నిర్లక్ష్యం వహించకుండా అధికారులు, సిబ్బంది మరో మూడు రోజులు పాటు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక అధికారి అరుణ బాబు సూచించారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎటువంటి ఇబ్బంది కలిగినా తహసిల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్లను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.సోమవారం నాయుడుపేట తహసిల్దార్ కార్యాలయంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి,నాయుడుపేట తహసిల్దార్ ఎం రాజేంద్ర, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా,సీఐ బాబి లతోపాటు రెవిన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే 3 రోజులు వర్షాలు ఎక్కువగా వస్తాయని తెలిపారు.వర్షాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఇండ్లలోను, కూలిపోయే చెట్ల కింద ఉండొద్దని, విద్యుత్ స్థంబాల చెంతకు వెళ్లొద్దని ప్రజలకు సూచించారు.ప్రజలందరూ వీలైనంత వరకు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని తెలిపారు. నీరు నిలిచే ప్రాంతాలకు,అండర్ బ్రిడ్జిలు వద్దకు వెళ్ళవద్దని తెలిపారు.పడిపోయే చెట్లు, కూలిపోయే భవనాలు ఉంటే అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో నీరు, ఆహారం, వసతి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది అందించే సూచనలు, సలహాలు పాటించి సురక్షితంగా ఉండాలని తెలిపారు.



## టీడీపీ కార్యకర్త కుటుంబానికి సాయం



**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** గోరంట్ల మండలంలోని మల్లాపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త, ఆర్యవైశ్య సభ్యులు కొమ్మిశెట్టి నారాయణ మూర్తి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు వారి ఇంటికి వెళ్లి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, రాష్ట్ర మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం టీడీపీ మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో 22,000/- ఇరవైరెండు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించి, కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు నిమ్మల శ్రీధర్, ఉత్తమ రెడ్డి, మాజీ సర్పంచ్ నరేష్, సర్పంచ్ నాగేనాయక్, సింగిల్ విండో చైర్మన్ జయచంద్ర,స్థానిక నాయకులు చెట్ల మహమ్మద్, వెంకట రెడ్డి, నరేష్ కుమార్ యాదవ్, మురళీ,రోహిత్, ప్రతాప్ నాయుడు, సుబహాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండండి: తహసీల్దార్ బ్రహ్మయ్య



**కనేకల్, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** కనేకల్ మండల పరిధిలోని మాల్యం-కనేకల్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వేదావతి-హగరీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. బైరవ తిప్ప ప్రాజెక్టు డ్యాం నిండిపోవడంతో వేదావతి హగేరి వద్ద నాలుగు గేట్లు ఎత్తి రెండు రోజుల క్రితం నీటిని విడుదల చేయడంతో, సోమవారం ఉదయం నుండి కనేకల్ వేదావతి హగరీ ప్రాంతానికి వరద నీరు చేరింది.ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై, వేదావతి హగరీ ప్రధాన రహదారి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, తహసీల్దార్ బ్రహ్మయ్య మాట్లాడుతూ "వేదావతి హగరీ నది వద్ద నీరు తీవ్రంగా ప్రవహిస్తున్నందున, ఎవరూ నది పరిసర ప్రాంతాలకు వెళ్లరాదు అని ప్రాణాపాయం ఉంటుందని సూచించారు. ప్రజలు, వాహన దారులు విషయం గమనించి హగరి వైపునకు వెళ్ళకూడదు అని ప్రజలు జాగ్రత్తగా ఉండి,అధికారుల సూచనలను పాటించాలి" అని తెలియజేశారు.వేదావతి హగరీ ప్రవాహం తగ్గేంత వరకు ప్రజలందరూ సహకరించాలని తహసీల్దార్ బ్రహ్మయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రిక్షా కార్మికుడికి నిత్యావసర వస్తువుల వితరణ



**నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** మౌనిక మదర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈదా రత్నశ్రీ ఓ రిక్షా కార్మికునికి బియ్యం,నిత్యావసర వస్తువులు అందించారు.భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలోని లోతు వానిగుంట ప్రాంతానికి చెందిన రిక్షా కార్మికుడు షేక్ మస్తాన్ అనారోగ్య కారణంగా ఇబ్బందులు పడడం గమనించిన మౌనిక మదర్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకురాలు ఈదా రత్నశ్రీ సోమవారం తమ కార్యాలయం వద్ద 20 కిలోల బియ్యం బస్తాలతో పాటు నిత్యవసర వస్తువులు,కొంత నగదును అందజేశారు.ఈ కార్యక్రమంలో సుధాకర్ నాయుడు, సాయి నాయుడు,రేష్మ,అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట సీపీఎం నిరసన




**గుత్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** గుత్తి పట్టణం ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా సిపిఎం పార్టీ ఆధ్వర్యం లో ధర్నా నిర్వహించారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి నిర్మల కెవిపిఎస్ అధ్యక్షులు మల్లికార్జున మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల పేద మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం వైద్యులకు లక్షల రూపా యలు వేతనాలు అందిస్తున్నది వాటిని తీసుకుంటున్న వైద్యులు ప్రభుత్వం రంగంలో వైద్యంను మెరుగుపరచాల్సిన ప్రభుత్వ వైద్యు లై జీతాలు సరిపోవని కాసులకు కక్కుర్తి పడి ప్రభుత్వ ఆసుపత్రి సమయంలో విధులు నిర్వహించ కుండా ప్రవేట్ ఆసుపత్రిలో పని చేస్తూ ఏమాత్రం మానవత్వం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులతో నిర్లక్ష్యం చేస్తున్నారు చుట్టుపక్కల గ్రామాలలోని గర్భవతులు పట్టణంలోని గర్భవతులు అందరూ వైద్యం కోసం గుత్తి పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి నప్పుడు వైద్య సిబ్బంది సరైన సదుపాయాన్ని కల్పించకుండా అనంతపూర్ గాని కర్నూల్ కానీ రిఫర్ చేయడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో గుత్తి మండల సిపిఎం పార్టీ మండల కార్యదర్శి నిర్మల కెవిపిఎస్ మండల అధ్యక్షులు మల్లికార్జున డివైఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్ కుమార్ మహిళా మండల కార్యదర్శి రేణుక పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

Truth of News
RNI NO : APTEL/25/A0239
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



## క్రీడల్లో దూసుకుపోతున్న అనంత మాణిక్యం బెల్లం హర్షిత



**అనంతపురం క్రైం, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** అనంతపురంలోని ఏరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న బెల్లం హర్షిత గుజరాత్ లో జరిగిన త్రోబాల్‌లో రాణిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటుంది. రోహిత్ అంబులెన్స్ యజమాని, వాల్మీకి సంఘం నాయకులు బెల్లం తిమ్మప్ప, రాధ దంపతుల కుమార్తె బెల్లం హర్షిత క్రీడల్లో ఆసక్తి ఏర్పరుచుకుని క్రమంగా అందులో రాటుతేలింది. తన కోచస్ రాజు, సరళ ప్రోత్సాహంతో మరింత పట్టుదలతో ముందుకు సాగిన బెల్లం హర్షిత త్రోబాల్ క్రీడలో బాలికల విభాగంలో తన తోటి క్రీడాకారునిలతో కలిసి కప్ సాధించి ప్రావీణ్యం సంపాదించుకుంది.

## కబడ్డీ పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



**పామిడి, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పామిడి మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలు మరియు సెలక్షన్ కార్యక్రమం సోమవారం పామిడి టి.సి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉత్సాహంగా ప్రారంభమైంది.వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ క్రీడా పోటీలు సజావుగా నిర్వహించారు. అండర్-14 మరియు అండర్-17 విభాగాలలో బాల, బాలికల విభాగాల్లో పామిడి మండలంలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఎంత ఉత్సాహంగా పాల్గొన్నారు.క్రీడాస్ఫూర్తితో జరిగిన ఈ పోటీల్లో పామిడి శ్రీ చైతన్య విద్యార్థులు కబడ్డీ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. అండర్-14 బాలుర విభాగంలో మరియు అండర్-17 బాలుర విభాగంలో కబడ్డీ పోటీల్లో మండల స్థాయిలో విజయం సాధించారు. విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. "విద్యార్థుల క్రమశిక్షణ, శ్రమ మరియు టీమ్ స్పిరిట్ వల్లే ఈ విజయం సాధ్యమైంది" అని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. శ్రీ చైతన్య స్కూల్ పిఈటి కార్తీక్‌ను శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం అభినందించారు.



## గుజరాత్ త్రోబాల్‌లో మెరిసిన అనంత ముత్యాలు

- **త్రో బాల్ ఛాంపియన్షిప్ 2025లో సత్తాచాటిన ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు**

**అనంతపురం, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** గుజరాత్‌లోని త్రోబాల్ అసోసియేషన్ నిర్వహించిన 33వ జూనియర్ బాల బాలికల జాతీయ త్రో బాల్ ఛాంపియన్షిప్ 2025లో విజేతలుగా ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు నిలిచారు. అనంతపురం విద్యార్థులైన రంజిత్ , ప్రభు, వరం నాయక్, సాజిద్ హుస్సేన్ లు మూడవ స్థానంలో నిలవగా బాలికల భాగంలో దర్శితా రెడ్డి , ఎం ప్రీతి, హర్షిత బెల్లం నాలుగవ స్థానంలో నిలిచారనీ కోచ్‌లు రాజు, సరళ తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు వారు అభినందించారు.







## గురి పెట్టాలిలా..

**పోలీసులు వినియోగించే ఆయుధాలపై అవగాహన**

**అనంతపురం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్పీ జగదీష్**



అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 27: పోలీసు విధుల్లో వినియోగించే ఆయుధాలు, సాధనాల పట్ల విద్యార్థి దశ నుండే అవగాహన కల్గి ఉండటం మంచిదని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అభిప్రాయపడ్డారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని షాదీఖానాలో సోమవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాలు, సాధనాలను ప్రదర్శనలో ఉంచారు. సుశిక్షుతులైన సిబ్బందిచే సందర్శనకు విచ్చేసిన ప్రజలకు ఆయుధాల గురించి అవగాహన చేశారు. సందర్భంలో ఎలాంటి ఆయుధాన్ని వినియోగిస్తారు, వాటి పని తీరు గురించి ఈసందర్భంగా విద్యార్థులకు జిల్లా ఎస్పీ అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..ప్రతీ సంవత్సరం అక్టోబర్ 21 వ తేదీ నుండీ 31 వ తేదీ వరకు విధినిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన పోలీసుల జ్ఞాపకార్థం పోలీసు అమరవీరుల వారోత్సవాలు జరుపుకోవడం దేశ వ్యాప్తంజా ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలో కూడా... పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నాము. ఈ వారోత్సవాలను ఈ ఏడాది అక్టోబర్ 21 అమర వీరుల సంస్మరణ దినంతో ప్రారంభించి అక్టోబర్ 31 వరకు జరుపుకుంటాము. భావిభావి భారత పౌరులైన విద్యార్థినీ విద్యార్థులకు, ప్రజలకు పోలీసు విధుల పట్ల అవగాహన కల్పించడం, విధి నిర్వహణలో పోలీసు వినియోగించే ఆయుధాలు, ఇతర సామగ్రి గురించి వారికి వివరించి ఆసక్తి పెంపొందిపచేస్తున్నాం. పోలీసు నిబద్దత, కార్యధీక్షత పట్ల చైతన్యం చేస్తున్నాం. పోలీసు అమరవీరుల స్ఫూర్తితో పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమాన్ని సమీక్షించి వారి శ్రేయస్సు గురించి కృషి చేస్తున్నాము. ఈ వారోత్సవాలలో భాగంగా...ఎన్నో ప్రజా సేవా కార్యక్రమాలను జిల్లా అంతటా చేపట్టడం జరుగుతోందని ఎస్పీ తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసు వ్యవస్థ ప్రజలకు తెలిపేది ఒక్కటే..... పోలీసులు కూడా మీ కుటుంబంలో ఒకరిగా బావించండి. మీకు ఎప్పుడు ఏ సహాయం కావాలన్న పోలీసులుగా మేము ఎల్లవేళలా అందుబాటులో ఉంటాము. మా పై విశ్వాసం పెంచుకోండి. ప్రజా సేవయే మా పరమావదిగా, ప్రజలు ప్రశాంత జీవనం గడపటం మా సంకల్పం.

**ఆయుధాలు, పరికరాలు, సాధనాలపై విద్యార్థులకు అవగాహన**


జిల్లా ఎస్పీ ఓపికతో విద్యార్థులకు పోలీసులు వినియోగించే ఆయుధాలు, పరికరాలు, సాధనాలపై అవగాహన చేశారు. వాటి పనితీరు, ఎక్కడ/ఎప్పుడు తయారు చేశారు, విధి నిర్వహణలో ఎలాంటి సందర్భాలలో వాడుతారో తెలియజేశారు. అసాంఘిక శక్తుల ఆటకట్టించడానికి, శాంతి భద్రతల పరిరక్షణకు తోడ్పడే ఆయుధాల వినియోగం గురించి వివరించారు. విహెచ్ఎఫ్ హ్యాండ్ సెట్ ద్వారా పోలీసులు తమ విధుల్లో సమాచారాన్ని ఎలా ఇచ్చి పుచ్చుకుంటారో విద్యార్థులతో మాట్లాడించారు. పోలీసు జాగిలంతో షేక్ హ్యాండ్ ఇప్పించడంతో పిల్లల్లో ఉత్తేజం మరింత రెట్టింపయ్యింది.

**ప్రదర్శనలో ఉంచిన ఆయుధాలు**

.22 రైఫిల్ , .410 మస్కెట్ , .303 రైఫిల్ , 762 ఎం.ఎం ఎస్ ఎల్ ఆర్, ఏ.కే 47, 5.56 ఎం.ఎం (ఇన్సాస్ ), 9 ఎం.ఎం. కార్బైన్ , .38 రివాల్వర్ , 9 ఎం.ఎం ఫిస్టోల్ , 9 ఎం.ఎం గ్లాక్ , వి.ఎల్ ఫిస్టోల్ , ప్రొజెక్టర్ ఫైరోటెక్ , 12 బోర్ పంప్ యాక్షన్ గన్ , ఎల్ .ఎం.జి, 51 ఎం.ఎం మోటారు, హెచ్ .ఇ 36 గ్రనేడ్ , యాంటీ రైట్ గన్స్ , గ్యాస్ గన్ , రోబోటెక్ ( బాడీ ప్రొటెక్టర్ ) , సేవాదళ్ డ్రస్ , ఫైబర్ లాఠీ, బాడీ ప్రొటెక్టర్ , స్టోన్ గార్డు, హెల్మెట్ , కేన్ లాఠీ, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ హెవీ, మీడియం, లైట్ ... డే మరియు నైట్ విజన్ బైనాక్యూలర్లు, జి.పి.ఎస్ , మెగాఫోన్ , లెటర్ బాంబు డిటెక్టర్ , డి.ఎస్ .ఎం.డి, హెచ్, హెచ్ ఎండి , ఎన్ ఎల్ జె డి నార్కో డిటెక్షన్ కిట్ , బాంబ్ బ్లాంకెట్ , బాంబ్ షీల్డ్ , ఎక్స్‌ప్లోజివ్ డిటెక్టర్ , పాలిరే యు.వి.లైట్ , క్లూస్ టీం, డస్ట్ ఫుట్ ప్రింట్ లిఫ్టర్ , టెథర్ డ్రోన్ మరియు డ్రోన్ కెమేరాలు, %యానమీ%, బాడీవోన్ కెమేరాలు, నెట్వర్క్ కెమేరాలు, సిమ్ బేస్ కెమేరాలు, ఫిన్స్ ( ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ నెట్ వర్కింగ్ సిస్టం) , డ్రోన్ కెమేరాలు, డి.ఎఫ్ .ఐ.డి, బాంబు రింగ్, వాటర్ కేనన్, వజ్ర వాహనాలు మరియు డాగ్ బృందాలను ప్రదర్శనలో ఉంచారు.ఈకార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ ఐ లు పవన్ కుమార్ , మధు, రాముడు, ఆర్ ఎస్ ఐ లు బాబ్జాన్ , మగ్బుల్ , రమేష్ నాయక్ , జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ ఎస్ ఐ జాఫర్ , గాండ్ల హరినాథ్ , లక్ష్మినారాయణ, పోలీసు సిబ్బంది మరియు నగరంలోని పలు విద్యాసంస్థలకు సంబంధించిన విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి


**పీజీఆర్ఎస్ అర్జీలను త్వరగా పరిష్కరించాలి - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**



**అనంతపురం కలెక్టరేట్, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** ఉపాధి హామీ పనులు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఇందులో అలసత్వం ఉండరాదని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మొంథా తుఫాన్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, ఉపాధి హామీ పథకం, ఈ-పంట నమోదు, ఏపీఎంఐపి, హౌసింగ్, తదితర అంశాలపై ఆయా శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, ఎస్డీసీలు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల క్షేత్రస్థాయి అధికారులతో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద లేబర్ టర్నవుట్ కి సంబంధించి గత వారంలో 3 లక్షల 72 వేల లక్ష్యం ఉండగా, కేవలం 77,319 మంది కూలీలను మొబిలైజేషన్ చేశారని, ఇది ఎంత మాత్రం తగదన్నారు. జిల్లాలోని విడపనకల్లు, నార్పల, డి.హీరేహాల్, వజ్రకరూరు, పెద్దపప్పూరు, తదితర 15 మండలాల్లో 20 శాతం కన్నా తక్కువగా లక్ష్యాన్ని చేరుకున్నారన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి 25వతేదీ వరకు విడపనకల్లు మండలంలో 12,600 లక్ష్యానికి గాను 1,101 చేరుకుని 8.74 శాతం మాత్రమే లక్ష్యాన్ని చేరుకున్నారని, నార్పల మండలంలో 18 వేలకు 1,846 చేసి 10.26 శాతం లక్ష్యం పూర్తి చేశారని, డి.హీరేహాల్ మండలంలో 9600 లక్ష్యానికి గాను 1,015 చేసి 10.57 శాతం మాత్రమే లక్ష్యం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఆయా మండలాల్లో వెంటనే ఉపాధి పనుల లేబర్ టర్నవుట్ లో పురోగతి తీసుకురావాలని, సంబంధిత ఏపీడీలు మండలాల్లో తనిఖీలు చేయాలని, రోజు ఉదయం 6 గంటలకు క్షేత్రస్థాయికి వెళ్లి పనులను మానిటర్ చేయాలని, ఉపాధి పనుల్లో పురోగతి తీసుకురావాలని ఆదేశించారు. పనుల్లో పురోగతి తీసుకురాకపోతే చర్యలు తీసుకునేందుకు వెనకాడమన్నారు. విడపనకల్లు, బ్రహ్మసముద్రం మండలాల ఎంపీడీవోలు 15 వర్క్ సైట్ తనిఖీలలో ఒకటి చేయలేదని, వెంటనే పూర్తి చేయాలన్నారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ కి సంబంధించి 100 శాతం లక్ష్యం చేరుకోవాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్, ఇన్స్టిట్యూషనల్ ప్లాంటేషన్, పల్లెవనాలకు సంబంధించిన ప్రతిపాదనలు పంపి మంజూరులు తీసుకుని గ్రౌండింగ్ చేయాలని, ఇప్పటికే మంజూరులు తీసుకున్న వాటిని పూర్తి చేయాలన్నారు. ఫారంఫండ్ పనులు, వ్యక్తిగత సోక్ పిట్లు, కమ్యూనిటీ సోక్ పిట్లను లక్ష్యానికి అనుగుణంగా గ్రౌండ్ చేసి పూర్తి చేయాలని, 90 రోజుల హౌసింగ్ కి సంబంధించి పురోగతి తీసుకురావాలని, వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ చేపట్టడంలో వేగం పెంచాలన్నారు. హౌసింగ్ కి సంబంధించి ఆవాస్ ప్లస్ 2024 సర్వే రిపోర్ట్ లో సర్వేయర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈకేవైసీ పూర్తి చేయాలని, వచ్చే నెల 5వ తేదీలోపు లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) అర్జీలను గడువు తీరకుండానే తప్పకుండా పరిష్కరించాలని, బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లడానికి వీలులేదని, ఇప్పటికే పెండింగ్ ఉన్న 39 బియాండ్ ఎస్ఎల్ఏలను వెంటనే పరిష్కరించాలన్నారు. అర్జీలను సరైన సమయంలో గడువులోపు నాణ్యతగా పూర్తి చేయడం ఎంతో ముఖ్యమైనదని, వచ్చే సోమవారం నాటికి బియాండ్ ఎస్ఎల్ఏ అర్జీలు పెండింగ్ ఉంటే సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫీడ్బ్యాక్ సర్వేలో సంతృప్త స్థాయి మరింత పెరగాలని, బొమ్మనహల్, సెట్టూరు తదితర మండలాల్లో ఆర్డీవోలు పర్యటించాలని, ఫీడ్బ్యాక్ సర్వేలో మరింత పురోగతికి కార్యచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ పంట సర్వేకి సంబంధించి 100 శాతం నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. మొంథా తుఫాను కారణంగా భారీ వర్షాల ప్రభావం వలన దెబ్బతిన్న జిల్లాలకు అవసరం మేరకు ఉన్నత స్థాయి ఆదేశాల మేరకు జిల్లాలోని డిపిఓ, పిఆర్, డిఎంహెచ్ఓ, ఆర్.అండ్.బి, వ్యవసాయ, పలు శాఖల పరిధిలో అధికారులు, సిబ్బంది సహాయక చర్యలకు హాజరయ్యేందుకు మెన్ మరియు మెటీరియల్ సిద్ధం చేసుకుని సన్నద్ధంగా ఉండాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పనాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, సిపిఓ అశోక్ కుమార్, హౌసింగ్ పిడి శైలజ, డ్వామా పిడి సలీమ్ భాష, డిపిఓ నాగరాజునాయుడు, జడ్పి సిఈఓ శివ శంకర్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రవితేజ 'మాస్ జాతర' ట్రైలర్..

**హైదరాబాద్ :** రవితేజ-శ్రీలీల జంటగా నటించిన తాజా చిత్రం 'మాస్ జాతర' మనదే ఇదంతా అనేది ఉపశీర్షిక. భాను భోగవరపు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ మూవీ ఈ నెల 31న బాక్సాఫీసు ముందుకు రానున్న సంగతి తెలిసిందే. ప్రమోషన్స్‌లో భాగంగా ట్రైలర్‌ను చిత్ర బృందం సోమవారం విడుదల చేసింది. రవితేజ నుంచి ఆయన అభిమానులు ఆశించే కామెడీ, యాక్షన్ ఈ సినిమాలో మెండుగా ఉన్నట్టు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది.




# 'మా ఇంటి బంగారం' ప్రారంభం



ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.2గా 'మా ఇంటి బంగారం' తెరకెక్కుతోంది. ఈ ఏడాది బ్యానర్ నుంచి వచ్చిన 'శుభం' సినిమా బ్లాక్ బస్టర్ అయిన సంగతి తెలిసిందే. ఈ కొత్త సినిమాలో సమంత, దిగంత్, గుల్షన్ దేవయ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సీనియర్ నటి గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

ఈ చిత్రానికి సమంత, రాజ్ నిడుమోరు, హిమాంక్ దువ్వూరు నిర్మాతలు. 'ఓ బేబి' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత సమంత, నందినీ రెడ్డి కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా ఇది. ఈ చిత్రానికి ఓం ప్రకాష్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, సంతోష్ నారాయణన్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. సీతా మీనన్, వసంత్ మరిన్‌గంటి కథ, స్క్రీన్‌ప్లే అందించారు. పల్లవి సింగ్ కాస్ట్యూమర్, ఉల్లాస్ హైదర్ ప్రొడక్షన్ డిజైనర్, ధర్మేంద్ర కాకరాల ఎడిటర్‌గా వర్క్‌చేస్తున్నారు. సన్నిహితులు, శ్రేయోభిలాషుల ఆత్మీయ కలయిక, ఆశీర్వాదాలతో సినిమా ప్రారంభమైంది. మూవీ ఫస్ట్ లుక్‌ను గమనిస్తే గ్రిప్పింగ్ యాక్షన్ డ్రామాగా అనిపించింది. అద్భుతమైన యాక్షన్ బ్యాంగ్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. సినిమా ప్రారంభమైందని, మరిన్ని వివరాలను తెలిజేస్తామని మేకర్స్ తెలిపారు.

# ట్రెండింగ్‌లో 'మీసాల పిల్ల..'




చిరంజీవి, నయనతార జంటగా నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు'. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం రిలీజైన ఫస్ట్ సింగిల్ 'మీసాల పిల్ల'తో చిరు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ ఎనర్జిటిక్ మెలోడీ ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్‌గా మారడమే కాకుండా, తెలుగు పాటకు దేశవ్యాప్తంగా అరుదైన ఘనతను సాధించడం విశేషమని మేకర్స్ చెబుతున్నారు. విడుదలైన కొద్ది రోజుల్లోనే ఈ పాట యూట్యూబ్ మ్యూజిక్ ఇండియాలో నెంబర్ 1 స్థానానికి చేరుకుంది. వరుసగా 13 రోజులు అగ్రస్థానాన్ని కొనసాగించి 36 మిలియన్లకు పైగా వ్యూస్ సంపాదించింది. ఈ పాట పాన్-ఇండియా సంచలనంగా మారింది.

ఈ పాటలోని క్యాచీ హుక్ స్టెప్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానులు పెద్ద ఎత్తున రీల్స్ క్రియేట్ చేస్తున్నారు. వెంకటేశ్ ఈ చిత్రంలో పూర్తి స్థాయి కీలక పాత్రలో కనిపించనుండటం సినిమా మీద అంచనాలను మరింత పెంచింది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లోని భారీ సెట్‌లో శరవేగంగా సాగుతోంది. సాహూ గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 సంక్రాంతికి రిలీజ్‌కి సిద్ధమవుతోంది.





# తప్పుకున్న సింధు

హైదరాబాద్ : భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి షట్లర్, రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత పి.వి సింధు ఈ ఏడాది బిడబ్ల్యూఎఫ్ టూర్ సీజన్‌కు దూరమైంది. పి.వి సింధు (30) ఈ ఏడాది యూరోపియన్ సీజన్ ఆరంభంలో కాలు గాయానికి గురైంది. గాయం నుంచి పూర్తి స్థాయిలో కోలుకోకుండానే బరిలోకి దిగిన పి.వి సింధు ఎక్కువగా తొలి, రెండో రౌండ్లలోనే పరాజయాలు చవిచూసింది. పారిస్ ఒలింపిక్స్‌లో పరాజయం అనంతరం పి.వి సింధు ఆశించిన ఆటతీరు కనబరచలేదు. ఇండియా ఓపెన్ సూపర్ 750, ప్రపంచ చాంపియన్‌షిప్స్ సహా చైనా మాస్టర్స్ సూపర్ 750లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకోవటమే ఈ సీజన్లో సింధు అత్యుత్తమ ప్రదర్శన. చివరగా నిరుడు డిసెంబర్‌లో సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ సూపర్ 300 టైటిల్ సాధించిన పి.వి సింధు.. వచ్చే ఏడాది పునరాగమనంపై గురి పెట్టింది. ప్రముఖ స్పోర్ట్స్ ఆర్థోపెడిషియన్ డాక్టర్ దిన్షా పర్దీవాల సహా ఇతర వైద్య నిపుణుల సలహాలు, సూచనల మేరకు ఈ ఏడాది బ్యాడ్మింటన్ సీజన్‌కు పూర్తిగా దూరం అవ్వాలని సింధు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సింధు సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది.

# ఐసీయూలో శ్రేయస్ అయ్యర్

**- ప్లీహానికి చీలికతో అంతర్గత రక్తస్రావం!**

**- సిడ్నీకి బయల్దేరిన క్రికెటర్ కుటుంబం**




**సిడ్నీ :** భారత క్రికెటర్, వన్డే జట్టు వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సిడ్నీలోని ఓ ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. భారత్, ఆస్ట్రేలియా మూడో వన్డేలో బ్యాక్‌వర్డ్ పాయింట్ నుంచి వెనక్కి పరుగెడుతూ కండ్లుచెదిరే క్యాచ్ అందుకుని ఆసీస్ బ్యాటర్ అలెక్స్ కేరీని అవుట్ చేసిన సంగతి తెలిసిందే. కఠినమైన క్యాచ్‌ను మెరుపు వేగంతో అందుకున్న శ్రేయస్ అయ్యర్.. వెంటనే పక్కటెముకల్లో నొప్పితో విలవిల్లాడాడు. బీసీసీఐ వైద్య బృందం శ్రేయస్ అయ్యర్‌కు తక్షణ చికిత్స చేసినా.. నొప్పి తీవ్రత దృష్ట్యా అతడిని లోకల్ హాస్పిటల్‌కు తీసుకెళ్లింది. శ్రేయస్ అయ్యర్ ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.

**ప్లీహానికి చీలిక :**

శ్రేయస్ అయ్యర్ ఎడమ పక్కటెముకల గాయానికి గురైనట్టు శనివారం బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. తదుపరి వైద్య పరీక్షలు, చికిత్స నిమిత్తం సిడ్నీలోని ఓ ఆసుపత్రిలో చేర్పించినట్టు వెల్లడించింది. వైద్య పరీక్షల్లో శ్రేయస్ అయ్యర్ ప్లీహం చీలిక గాయానికి గురైనట్లు వైద్య నిపుణులు గుర్తించారు. ప్లీహంలో చీలికతో శరీరంలో అంతర్గత రక్తస్రావం జరిగే ప్రమాదం ఏర్పడుతుంది. కొన్ని సందర్భాల్లో ప్లీహానికి శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుంది. లేదంటే, చీలిక వచ్చిన ప్లీహం భాగాన్ని తొలగించాల్సి ఉంటుందని తెలుస్తోంది. శ్రేయస్ అయ్యర్ ప్లీహం చీలిక గాయానికి గురైనా.. ఆ గాయం తీవ్రత, తదుపరి వైద్య చికిత్స వంటి వివరాలను ఆసుపత్రి వర్గాలు, బీసీసీఐ వైద్యులు నిర్ధారించాల్సి ఉంది. ప్రస్తుతం శ్రేయస్ అయ్యర్ ఆరోగ్యం నిలకడగా ఉందని, మెరుగ్గా కోలుకుంటున్నాడని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

**సిడ్నీకి శ్రేయస్ కుటుంబం :**

శనివారం గాయపడిన శ్రేయస్ అయ్యర్ ఇంకా ఐసీయూలోనే ఉండటం, ప్రాణాపాయ ప్లీహం చీలిక గాయం ఆందోళనతో స్టార్ క్రికెటర్ కుటుంబ సభ్యులు సోమవారం సిడ్నీ బయల్దేరారు. తొలుత శ్రేయస్ అయ్యర్ చెల్లెలు సిడ్నీ వెళ్తుందని, అందుకు అవసరమైన వీసా అనుమతుల జారీకి బీసీసీఐ ఏర్పాట్లు చేసింది. కానీ, తాజాగా శ్రేయస్ అయ్యర్ గాయం తీవ్రత, అతడు సుమారు మరో వారం రోజుల పాటు సిడ్నీ ఆసుపత్రి ఐసీయూలోనే ఉండనుండటంతో అతడి తల్లిదండ్రులు సైతం సిడ్నీకి వెళ్లనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను బీసీసీఐ పర్యవేక్షిస్తోంది.

# ఆదోని టూటౌన్ సీఐపై చర్యలు తీసుకోవాలి

## పత్తికొండలో న్యాయవాదులు నిరసన

**పత్తికొండ టౌన్, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** ఆదోనిలో సీనియర్ న్యాయవాది వెంకటేష్‌పై ఆదోని టూ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దురుసుగా ప్రవర్తించి ఆయనను అవమానించడం సరికాదని, తక్షణమే సీఐపై జిల్లా ఎస్పీ తగిన చర్యలు తీసుకోవాలని పత్తికొండ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వై.మధు బాబు డిమాండ్ చేశారు. సోమవారం పత్తికొండ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో పత్తికొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు యందు న్యాయవాదులు విడుదలను బహిష్కరించి నిరసన చేపట్టారు. అనంతరం పత్తికొండ బార్ అసోసియేషన్ సభ్యులు మరియు న్యాయవాదులు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి జ్యోష్ణ దేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో న్యాయవాదులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదులకు ప్రత్యేక చట్టం



తీసుకురావాలని కోరారు. న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురాని యెడల న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ బార్ సోసియేషన్ ట్రెజరర్ సూరజ్ నబి, న్యాయవాదులు ఎల్లారెడ్డి, మైరాముడు, గోపాల్ రెడ్డి, చంద్రశేఖర్ నాయుడు, శ్రీనివాసరెడ్డి, హనుమంత రెడ్డి, సత్యనారాయణ, నాగేష్, కృష్ణయ్య, నారాయణస్వామి, నాగభూషణం రెడ్డి, దామోదరచారి, నరసింహులు, నెట్టేకల్లు, వెంకటేశ్వర్లు, మునయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరులో మెరిసిన పత్తికొండ వజ్రం

## అండర్- 17 వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించిన షేక్ అఫ్రిది






**పత్తికొండ టౌన్, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** గుంటూరులో నిర్వహించిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పత్తికొండకు చెందిన షేక్ అఫ్రిద్ బంగారు పతకం సాధించాడు. ఎస్ జి ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 17 విభాగంలో షేక్ అఫీఫ్ద్ బంగారం పతకం సాధించి అరుణాచల్ ప్రదేశ్ నేషనల్ స్కూల్ గేమ్స్ కు సెలెక్ట్ అయ్యాడనీ నవంబర్‌లో జరగబోయే పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున షేక్ అఫ్రిది పాల్గొంటారని కోచ్ యూసఫ్ భాష తెలిపారు.తమ కుమారుడు షేక్ అఫ్రిద్ బంగారు పతాకం అందుకోవడం ఆనందంగా ఉందని తల్లిదండ్రులు షేక్ ఖలీల్, తల్లి మాధవి తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి పత్తికొండ కు పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తానని తను బంగారు పతకం సాధించడంలో తన కోచ్ యూసుఫ్ భాష ఇచ్చిన మెలకువలు ఎంతో ఉపయోగపడ్డాయని షేక్ అఫ్రిద్ తెలిపాడు.

## ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలి

- **పోలీసు గ్రీవెన్స్‌లో 145 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ జగదీష్**



**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీనీ లోతుగా విచారించి చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన నాణ్యతగా పరిష్కారం చూపాలనే రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం మేరకు జిల్లా ఎస్పీ సోమవారం నాడు స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక ) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలమూలల నుండీ వచ్చిన ప్రజల నుండీ ఎస్పీ 145 ఫిర్యాదులు స్వీకరించారు. పిటీషనర్లతో ముఖాముఖి మాట్లాడారు. లోతుగా వారి సమస్యలను విని అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈకార్యక్రమంలో అనంతపురం మహిళా డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



## భద్రతపై భారత్ మరింత దృష్టి

**హైదరాబాద్, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ త్రివిధ దళాల బలోపేతంపై మరింత దృష్టిపెట్టింది. మన సైనిక శక్తి ప్రపంచానికి తెలియడంతో సరికొత్త ఆయుధాలతోపాటు సరికొత్త సైన్యాన్ని అప్‌గ్రేడ్ చేస్తోంది. సమకాలీన యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. ఈ క్రమంలోనే "భైరవ్ బెటాలియన్లు" రూపుదిద్దుకున్నాయి. సైన్యంలో ఇదో కీలక పరిణామం. ఆధునిక పరికరాలు, స్మార్ట్ సెన్సర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఈ యూనిట్లు అత్యంత వేగంగా స్పందించగల సామర్థ్యం కలిగి ఉంటాయి. లెఫ్టినెంట్ అజయ్ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. నవంబర్ 1న తొలి భైరవ్ దళం రంగప్రవేశం చేస్తుంది. ఇప్పటికే ఐదు యూనిట్లు శిక్షణ దశలో ఉండగా, మరో 20 పైగా సిద్ధం చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. భైరవ్ యూనిట్ల ప్రధాన లక్ష్యం ? సాధారణ పదాతిదళాలు లేదా ప్రత్యేక బలగాలు నేరుగా వీలుపడనప్పుడు వ్యూహాత్మకంగా సాహసోపేతమైన ఆపరేషన్లు నిర్వర్తించడం. ఒక్కో యూనిట్‌లో 250 మంది అత్యంత నిపుణులైన జవాన్లు, 78 మంది అధికారిస్థాయి నాయకత్వంతో ఉంటారు. వీరు శత్రు భూభాగంలో లోతుగా ప్రవేశించే తక్షణ దాడులు, ఆపరేషన్లు, సీక్రెట్ మిషన్‌లు నిర్వర్తించగల నేర్పు కలిగి ఉంటారు. సంఖ్యాపరంగా తక్కువగా ఉన్నప్పటికీ, క్రియాశీలత, సమర్థత పరంగా వీరి ప్రాధాన్యం ఎంతో ఎక్కువ.భైరవ్ దళాల ప్రవేశం భారత సైన్యంలో మారుతున్న రణరీతులను ప్రతిబింబిస్తోంది. భవిష్యత్తులో యుద్ధాలు కేవలం బలంపై కాకుండా టెక్నాలజీ, వేగం, గూఢచారి సమాచారంపై ఆధారపడతాయి. ఈ యూనిట్లు వీటన్నింటిని సమన్వయం చేస్తూ భవిష్యత్ యుద్ధరంగానికి సరైన మోడల్‌గా నిలుస్తాయి. దేశ భద్రతా వ్యవస్థలో ఇవి ఒక కొత్త అధ్యాయం ఆరంభమనే చెప్పాలి.భైరవ్ బెటాలియన్లు భారత రక్షణ వ్యవస్థలో సంస్కరణాత్మక మార్పుకు సూచిక. ఇవి శత్రు ప్రాంతాల్లో తక్షణ చర్యకు ప్రత్యేక యాంత్రిక మానవ శక్తుల్లా పనిచేస్తాయి. ఇలాంటి యూనిట్లు సైన్యంలో చేరడం భవిష్యత్తు సమర వ్యూహాలకు భారత సైన్యం పూర్తిగా సిద్ధమైందని చెప్పవచ్చు.

## పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

- **తప్పిన పెనుప్రమాదం**

**ఒంగోలు, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** ప్రకాశం జిల్లా మార్కాపురం -కుంట మధ్య ఆదివారం రాత్రి ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదం నుంచి తప్పించుకుంది. మార్కాపురం నుంచి బెంగళూరు వెళ్తున్న బస్సు కొట్టాలపల్లి గ్రామ మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో ఉన్న ఎనిమిది మంది ప్రయాణికులు ఆందోళనకు గురైయారు. డ్రైవర్ సకాలంలో బ్రేక్ వేయడంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

## పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

- **ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు**



**నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** నాయుడుపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు జీవీఆర్ నాయుడు,వినయ్ కుమార్,సంపూర్ణమ్మ లు అన్నారు. సోమవారం వారు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు.ఈ సందర్భంగా వారు ఆసుపత్రి వైద్యులతో చర్చించారు.వైద్యుల తోపాటు సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి సకాలంలో మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. రోగులను పరామర్శించి వారికి అందుతున్న వైద్య సేవల వివరాలను ఆరా తీశారు. నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలియజేశారు.



## అమరావతికి చట్టభద్రత

**గుంటూరు, సూర్య వాస్తవం, అక్టోబర్ 27:** ఏ రాజకీయ పార్టీకైనా ప్రజాభిప్రాయమే ఫైనల్. ప్రజల అభిష్టానికి వ్యతిరేకంగా వెళితే ప్రతికూల ఫలితాలు తప్పవు. అయితే ఈ విషయంలో వెనక్కి తగ్గిన వారే ప్రజల మధ్య నిలబడగలరు. కానీ ఈ విషయంలో ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి మొండిగా ముందుకు వెళ్తున్నారు. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత కూడా అమరావతి రాజధాని నిర్మాణం పై ఆయన అభిప్రాయం మారలేదు. ఇటీవల ప్రెస్ మీట్ లో అమరావతిపై విముఖత చూపేలా మాట్లాడారు. ఇక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు ఆ పార్టీ అనుకూల మీడియా, సోషల్ మీడియా గురించి చెప్పనవసరం లేదు. పేర్ని నాని లాంటి వ్యక్తి అయితే అమరావతిని ఉద్దేశించి చాలా తేలిగ్గా మాట్లాడారు. అమరావతి మునిగిపోతుందని ఒకరు.. అక్కడ పెట్టుబడి పెట్టడం వేస్ట్ అన్నట్టు మాట్లాడారు. చివరకు వైసిపి గెలిచిన జగన్ అమరావతి నుంచి పాలన సాగిస్తారన్న సకల శాఖ మంత్రి సజ్జలకు సైతం జగన్ క్లాస్ పీకినట్లు వార్తలు వచ్చాయి. అమరావతి రాజధానిపై నాడు జగన్ సర్కార్ వ్యవహరించిన తీరు కూడా మొన్నటి ఓటమికి ఒక కారణం. కానీ దాని నుంచి గుణపాఠాలు నేర్చుకోలేదు జగన్మోహన్ రెడ్డి.2014, 2019 ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ఆ రెండుసార్లుతో పోల్చుకుంటే 2024 ఎన్నికల్లో బిజెపికి వచ్చిన స్థానాలు చాలా తక్కువ. దానికి కారణం లేకపోలేదు. వ్యవసాయానికి సంబంధించి మూడు సాగు చట్టాలను తీసుకొచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. దేశవ్యాప్తంగా దీనిపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయింది. ప్రజల అసంతృప్తిని గమనించారు నరేంద్ర మోడీ. తాను ప్రవేశపెట్టిన సాగు చట్టాలపై ప్రజలకు అర్థమయ్యేలా చెప్పలేకపోయామని.. అందుకే వాటిని రద్దు చేస్తున్నట్లు చెప్పి వెనక్కి తగ్గారు ప్రధాని మోదీ. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఎప్పుడైతే సాగు చట్టాలను వెనక్కి తీసుకున్నారు కొంత సానుకూలత గా మార్చుకోండి బిజెపి. ఆ సాగు చట్టాలను వెనక్కి తీసుకోకుంటే మాత్రం బిజెపికి భారీ మూల్యం తప్పదుఅయితే మొన్నటి ఎన్నికల్లో జగన్ మూడు రాజధానుల నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకించారు. అయినా సరే వైసీపీ అమరావతిపై విషం చిమ్మడం మానలేదు. అయితే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం సైతం స్పష్టమైన సంకేతాలు పంపగలిగింది. ఇకమీదట అమరావతి రాజధానిని కదిలించలేరని తన చర్యల ద్వారా చెప్పింది. ఏకంగా కేంద్ర ప్రభుత్వంలో కీలకమైన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన ప్రధాన కార్యాలయాన్ని అమరావతిలో నిర్మించాలని భావిస్తోంది. నాలుగు ఎకరాల భూమిని అమరావతిలో కొనుగోలు చేసింది. 12 కోట్ల రూపాయలు వెచ్చించి ఏపీ ప్రభుత్వం నుంచి ఆ భూమిని కొనుగోలు చేసింది రిజర్వ్ బ్యాంక్. అన్ని ఆలోచించి రిజర్వ్ బ్యాంక్ ఈ నిర్ణయానికి వచ్చింది. కచ్చితంగా అమరావతిని కేంద్రం చట్టబద్ధత చేస్తుందని తెలిసి ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. రిజర్వ్ బ్యాంక్ పరిధిలో పనిచేసే 12 ప్రాంతీయ బ్యాంకుల సైతం తమ ప్రధాన కార్యాలయాలను నిర్మించనున్నాయి. ఈ నెల 28న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఈ కార్యాలయ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. కేంద్రం నుంచి అనుమతి తీసుకున్న తర్వాత మాత్రమే ఈ ఆర్థిక రంగ బ్యాంకింగ్ సంస్థల ఏర్పాటు జరుగుతుంది. అంటే త్వరలో పార్లమెంటులో అమరావతి రాజధానికి చట్టబద్ధత లభించనుందన్నమాట.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (ASSOCIATE EDITOR -N.ARIF ALI ) CELL : 80740 10854